
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 30 జూలై 2024 | 5





వడి..వడిగా : రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి
- వివరాలు 7లో



నాట్లు..పాట్లు : నిడదవోలు మండలం తాళ్లపాలెంలో మళ్లీ నాట్లు



చూస్తుంటే కన్నీళ్లే : మధురపూడి వద్ద కనుచూపుమేరలో ముంపు బారిన పడిన చేలు

నిండా ముంచినది

ఈ ఏడాది అన్నదాతకు మిగిలింది కన్నీళ్లే

- పంట చేలలో వీడని ముంపు
- 14.646 హెక్టార్లలో మునక
- లబోదిబోమంటున్న రైతన్న
- తగ్గుతూ ఉన్న గోదారి వరద
- నీటిలో మునిగి ఉన్న లంకలు
- నష్టం అంచనాకు బృందాలు

రాజమహేంద్రవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి)/ కొవ్వూరు/ పెరవలి/నిడదవోలు : వరద వదిలింది.. కష్టం..నష్టం మిగిలింది..గోదావరి ఎగువ భాగంలో తగ్గుతున్నప్పటికి జిల్లా పరిధిలో లంక భూములన్ని ముంపునకు గురయ్యాయి. జిల్లాలో రాజమహేంద్రవరం, సీతానగరం, కొవ్వూరు, తాళ్ళపూడి, నిడదవోలు, కడియం,పెరవలి మండలాల్లో గోదావరి పరీవాహక ప్రాంతం విస్తరించి ఉంది.ఈ నేపథ్యంలో ఆయా మండలాల్లో ఉన్న లంకలు నీట మునిగాయి. దీంతో గత 10 రోజులుగా లంక వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట చేలు నీట మునిగాయి. ఉద్యాన పంటలు కుళ్లిపోయాయి. ఎటు చూసినా కన్నీళ్లే.. కష్టం నష్టమే మిగిలింది. దీంతో రైతులు తమ పంటలను చూసుకుని లబోదిబోమంటున్నారు.ఇంకా పలు చోట్ల చేలు తేరుకోలేదు.లంక భూములపై ఆధారపడి అరటి, కూరగాయలు, పూల తోటలు సాగు చేస్తుంటారు. పశువులకు అవసరమైన పచ్చగడ్డి బీడులు పెంచుతుంటారు. వరద నీరు అధికంగా రావడంతో వేలాది ఎకరాల్లో వరదనీరు చేరింది. గోదావరి పూర్తిగా తగ్గినప్పటికి పల్లపు లంక భూముల్లో నీరు మాత్రం వారం రోజులు వరకు అదే విధంగా ఉంటుందని దీంతో పంటలు ఊటబారిన పడి నష్టపోతామని రైతులు వాపోతున్నారు. తీపర్రు, పుష్కరాల రేవుకు వెళ్ళే సిమ్మెంట్ రోడ్డు మీదుగా నీరు ప్రవహించింది. సాయంత్రానికి క్రమేపి తగ్గుముఖం పట్టింది. ఇక్కడే సంపద తయారికేంద్రం వైపు ఉన్న పుంత రోడ్డు కూడా నీట మునిగింది. పలు గ్రామాల్లో పశువులు పాకలు కూడా నీట మునగడంతో పశువులను సురక్షిత ప్రదేశాలకు తరలించారు. జిల్లాలో జూలైలో మొత్తం 14,646.5 హెక్టార్లలో వరి పంట, కొంత చెరకు నీటిలో మునిగిపోయాయని జిల్లా వ్యవసా యాధికారి ఎస్.మాధవరావు తెలిపారు.

నిడదవోలులో ముంపులోనే 2 వేల ఎకరాలు

నిడదవోలు మండలంలో 16,500 ఎకరాల్లో రైతాంగం వరి సాగు చేస్తుండగా ఎర్రకాలువ వరదతో సుమారు 8500 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. తాళ్లపాలెం తదితర గ్రామాల్లో సుమారు 120 ఎకరాల్లో రైతాంగం తిరిగి మరోసారి నాట్లు వేస్తున్నారు. సుమారు 3000 ఎకరాల్లో వరిచేలను దక్కించుకునేందుకు రైతాంగం ఎరువులను వినియోగిస్తున్నారు. సుమారు 2000 ఎకరాలు సాగు చేసే అవకాశం లేక నీట మునిగి ఉండడంతో అలాగే వదిలేశారు.

వరద నష్టం అంచనాకు ప్రత్యేక బృందాలు


ఈ నెలలో వరదలు,ప్రకృతి వైపరీత్యాల కారణంగా జరిగిన నష్టాన్ని గణన చేయడానికి మండల స్థాయిలో ప్రత్యేక బృందాల ద్వారా నివేదికలు తయారు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.రాజమహేంద్ర వరంలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె సోమవారం రాత్రి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎర్రకాలువ, బురద కాలువ,కొవ్వాడ కాలువ, గోదారి బండ, రహదారుల మరమ్మ తులు,ఇరిగేషన్ శాఖల ప్రతిపాదనలపై సమీక్షించారు.వరద ముంపు నివారణ చర్యలు తక్షణం చేపట్టాలన్నారు.నష్టాలు,పునరావాస కార్యక్రమాలు స్వల్ప, దీర్ఘకాలిక ప్రాతిపదికన చేపట్టి నివేదిక ఇవ్వాలన్నారు.



కానూరు అగ్రహారంలో నీట మునిగిన పామాయిల్ తోట



పెరవలి మండలం తీపర్రు వద్ద నీట మునిగిన అరటితోట



చూస్తుంటే కన్నీళ్లే : మధురపూడి వద్ద చేలు ఇలా..



శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో మంత్రి దుర్గేష్ వెనుక కానరాని ఫొటోలు

చైర్మన్ వెనుక గత పాలకుల ఫొటోలు(ఫైల్)

ప్రభుత్వం మారింది.. మీరు మారరా!

నిడదవోలు కౌన్సిల్ హాలులో నేటికి కానరాని సీఎం, డిప్యూటీ సీఎంల ఫొటోలు

ప్రభుత్వం మారినా స్థానిక పాలకుల తీరు మాత్రం మారడంలేదు.. ఇంకా గత ప్రభుత్వంలో ఉన్నట్టే ప్రవర్తిస్తున్నారు. అటు అధికారులు కిక్కురుమనలేకపోతున్నారు. ఈ చిత్రాలే చూశారా.. ఇది నిడదవోలులోని మునిసిపల్ కౌన్సిల్ హాలు..గత ప్రభుత్వంలో చైర్మన్ వెనుక గోడకు ఎవరు ఉన్నారో చూశారా.నాటి పాలకుల చిత్రపటాలను తగిలించారు.. సహజంగా కౌన్సిల్ హాలులో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఫొటోలు మాత్రమే ఏర్పాటు చేసే ఆనవాయితీ ఉండగా గత ప్రభుత్వంలో చైర్మన్ ఫొటో కూడా పెట్టుకోవడం విమర్శలకు తావిచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వం మారింది..కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు 50 రోజులవుతుంది. కూటమి అధికారం చేపట్టిన తొలి రోజు నుంచే జిల్లావ్యాప్తంగా మునిసిపాలిటీలు.. పంచాయతీలు.. ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలోనూ సీఎం చంద్రబాబు.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలు వెలిశాయి. అయితే మంత్రి దుర్గేష్ నియోజకవర్గమైన నిడదవోలులో మాత్రం ఇంకా పాలకులు కళ్లు తెరవలేనట్టుంది..ఇలా ఫొటోలు తగిలించకుండా వదిలేశారు.. శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి మంత్రి దుర్గేష్ హాజరయ్యారు. ఆ తరువాత అయిన అధికారుల్లో కదలిక వస్తుందని కూటమి నాయకులంతా చూశారు.. సోమవారమూ ఇంతే..అధికారులు..పాలకులు ఇకనైనా మేల్కొండి.. కూటమి ప్రభుత్వంలో ఉన్నాం..గుర్తుంచుకోండి మరి..! - నిడదవోలు

12 రోజులుగా తగ్గని గోదావడి

గోదావరి నదీ తీరప్రాంతం గత 12 రోజులుగా వరద ఉధృతితో బిక్కుబిక్కుమంటుంది. ఈ నెల 19వ తేదీ నుంచి అఖండ గోదావరికి వరద పోటెత్తి ప్రమాదకరంగా ప్రవాహిస్తుంది. ఎగువన భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక, దిగువన ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దాటి అధికారుల అంచనాలకు అందకుండా ఉధృతంగా ప్రవహిస్తుంది.ఎగువన భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టినా రాజమహేంద్రవరం అఖండ గోదా వరిలో అదే ఉధృతి కనిపిస్తోంది. బ్యారేజీ నుంచి నెమ్మదిగా కిందకు వరదనీరు పోతోంది. సోమవారం రాత్రి 11 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నీటిమట్టం 14.40 అడుగులుగా ఉంది.బ్యారేజి నుంచి దిగువకు 13,92,438 క్యూసెక్కులు విడుదల చేశారు. మంగళవారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకునే అవకాశం ఉన్నట్టు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. పూర్తిగా వరద నీరు లాగి, సాధారణ పరిస్థితులు నెలకొనడానికి రెండు మూడు రోజులు పడుతుంది. భద్రాచలం వద్ద బాగా తగ్గు తోంది.సోమవారం రాత్రి 11 గంటలకు నీటిమట్టం 42.80 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉప సంహరించుకున్నారు. ఇప్పటికే సుమారు 10 అడుగులకు పైగా వరద లాగేసింది. ఎగువన భద్రాచలం నుంచి ధవళేశ్వరం బ్యారేజీకి వరద చేరుకోవడానికి సుమారు 24 గంటలు పడుతుంది. ఈ నేపథ్యంలో ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా రాజమహేంద్రవరం, కొవ్వూరులో రేవులన్నీ ముంపులోనే ఉన్నాయి.గోష్పాదక్షేత్రంలో మూడో రోజు ఆలయాలన్నీ వరద ముంపులోనే ఉన్నాయి.క్షేత్రంలోకి వచ్చే రెండు రహదారుల్లో గీతా మందిరం గేట్ల వరకు వరద నీటి ప్రవాహం చేరుకుం ది.గత వారం రోజులుగా క్షేత్రంలోని ఆలయాలన్నిటిని మూసివేశారు. వినాయకుడు, కనకదుర్గమ్మ, బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, అయ్యప్ప, మరకత గాయత్రి,లక్ష్మీ నరసింహస్వామి, షిరిడి సాయిబాబా ఆలయాల చుట్టూ వరద నీరు చేరింది. ఇసుకర్యాంపుల తవ్వకాలతో బలహీనపడిన ఏటిగట్లు ఎంతవరకు వరదను నిలువరిస్తాయోనని తీరప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నది లోపలికి ఎవ్వరు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటుచేశారు. కొవ్వూరు మండలంలోని మద్దూరులంక,వల్లిపాలెంలో నివసిస్తున్న వలస మత్స్యకారులను తరలించడానికి మద్దూరు జడ్పీ హైస్కూల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటుచేశారు. మద్దూరులంక గ్రామంలోకి వరద నీరు ప్రవేశించకుండా ఏటిగట్టు బలహీనంగా ఉన్న ప్రాంతాన్ని ఇసుకబస్తాలతో పటిష్ట పరిచారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటుచేశారు.వరద గోదావరిని చూడడానికి పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో క్షేత్రానికి వస్తున్నారు.మహిళలు పసుపు, కుంకుమలు వేసి గోదారమ్మకు పూజలు చేస్తున్నారు.



కలెక్టరేట్ వద్ద టిడ్కో లబ్ధిదారుల నిరసన ప్రదర్శన

మా టిడ్కో ఇళ్లపైనా జగన్ అప్పు తెచ్చాడు..

- బ్యాంకుల నుంచి జప్తు నోటీసులు వస్తున్నాయి..
- బొమ్మూరు టిడ్కో లబ్ధిదారుల ఆందోళన
- కలెక్టరేట్‌లో మీ కోసం - 114 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూలై 29 : అధికారులు సమన్వయంగా ఒకరితో ఒకరు మాట్లాడుకుని సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా నలుమూలల ప్రజల నుంచి వచ్చిన 114 అర్జీలు స్వీకరించారు. ఆన్‌లైన్‌లో 108, ఆఫ్‌లైన్‌లో 6 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో రెవెన్యూ 43, పంచాయతీరాజ్ 20, హోం (పోలీస్) 12, హౌసింగ్ 6 ,ఇతర శాఖలకు 33 అర్జీలు వచ్చాయని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం తమ టిడ్కో ఇళ్ళకు బ్యాంక్ రుణంపై వడ్డీ మాఫీ చేస్తామని చెప్పి.. తమ ఇళ్ళపై లోను తెచ్చుకుని మోసం చేసిందని బొమ్మూరు టిడ్కో హౌసింగ్ ఫేజ్ -1 సి బ్లాక్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోయేషన్ లబ్ధిదారులు నిరసన తెలిపారు.సి బ్లాక్‌లో 672 ఇళ్లు ఉన్నాయని అందరికి బకాయి ఉందన్నారు. వడ్డీభారం సగటున ప్రతి లబ్ధిదారుడికి రూ.20 వేల నుంచి రూ. 90 వేల వరకు ఉందన్నారు. ఇప్పుడు మొండిబకాయిగా జమకట్టి మాకు జప్తునోటీసులు జారీ చేశారని..న్యాయం చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు ఈ.శ్రీనివాస్,మహిళలు కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. ఏపీ పేపరుమిల్స్ ఎంప్లాయిస్ మల్టీపర్పస్ కో-ఆపరేటివ్ సొసైటీలో సుమారు రూ.4 కోట్ల వరకు డిపాజిట్లు చేశామని..గత 9 నెలలుగా తమకు డిపాజిట్లపై రావాల్సిన వడ్డీని మిల్లు యాజమాన్యం నిలిపివేసిందని ఏపీ పేపర్ మిల్స్ మాజీ ఉద్యోగులు ఆందోళణ వ్యక్తం చేశారు.కలెక్టరేట్‌కు తమ గోడును వివరించారు. పిల్లల చదువులు, ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం డబ్బులు డిపాజిట్ చేశామని కానీ గత 9నెలలుగా పరిస్థితి చూస్తే మా డబ్బు భద్రతపై అనుమానం కలుగుతుందన్నారు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలన్నారు. గత కలెక్టర్ ను మూడుసార్లు కలిసి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. జిల్లా సహకార శాఖ అధికారికి పంపి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 35 అర్జీలు

రాజమహేంద్రవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టం(మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ డి.నరసింహ కిషోర్ స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో బాధితుల సమక్షంలోనే ఫోన్‌లో మాట్లాడి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 35 అర్జీలు ఎస్పీ స్వీకరించారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్ఆర్.రాజశేఖర్ రాజు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సూరి అప్పారావు, ఎస్ఐ అలీ ఖాన్ పాల్గొన్నారు.



మా డబ్బులేమయ్యాయో : పేపరుమిల్లు రిటైర్డ్ కార్మికుల నిరసన

బియ్యమూ... వదల్లే!



గత టీడీపీ ప్రభుత్వంలో 25 కిలోల పీఎల్ బియ్యం బస్తా రూ.800.. లలిత బ్రాండ్ అయితే రూ.850.. వైసీపీ అధికారంలోకి వచ్చింది.. ధరల్లో అమాంతం తేడా వచ్చింది.. బస్తా కు ఒక కిలో చొప్పున పెంచి సుమారు రూ.500 వరకూ పెంచేశారు.. ఇదేమిటని అడిగితే ధరలు పెరిగాయని చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పీఎల్ బస్తా ధర రూ.1200 నుంచి రూ.1300 ఉందంటే పరిస్థితి ఎలా మారిందో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వంలో బియ్యం ధరలపై నియంత్రణ లేకపోవడంతో ఇష్టానుసారం పెంచేశారు..కూటమి ప్రభుత్వం దృష్టి సారించి బియ్యం ధరలను తగ్గించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్లూ బియ్యం ధరలు దంచుడే

- అమాంతం పెరిగిన ధరలు
- ఒక్కో బస్తాకు రూ.400 పెంపు
- బస్తాకు 26 కిలోలు చేసి నొక్కుడు
- ధరలపై నియంత్రణ కరువు
- మిల్లర్లు.. వ్యాపారుల మాయాజాలం
- నాసిరకం బియ్యం కిలో రూ.40
- రంగు సంచుల్లో రేషన్ బియ్యం
- మోసపోతున్న వినియోగదారుడు
- కూటమి వచ్చినా తగ్గని వైనం
- కళ్లు మూసుకున్న విజిలెన్స్
- ధాన్యాగారంలో ఇదీ దుస్థితి

బియ్యం ధరలు చూస్తుంటే అన్నం కుండ వణుకుతోంది. ధరలపై నియంత్రణ లేకపోవడంతో అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతున్నాయి. దీంతో సామాన్యుడికి ముద్ద దిగడం లేదు.రూ.40 పెట్టినా కేజీ బియ్యం రాని పరిస్థితి ఉంది.సన్నబియ్యం రైతు బజార్‌లోనే రూ.49కి విక్రయిస్తుంటే ఇక బయట వ్యాపారులను ఏమంటాం ..పరిస్థితి ఇలాగే కొనసాగితే బియ్యం గింజల లెక్కన వండుకోవాల్సిందేనేమో..ఎందుకంటే గత ఐదేళ్లలో బియ్యం ధరలు అంతలా పెరిగిపోయాయి. ప్రస్తుతం కూ టమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బియ్యం ధరలపై నియంత్రణ విధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

100 కిలోల ధాన్యం బస్తా రూ.2300

ధాన్యం ధర గిట్టుబాటుకాక రైతు దైన్యంగా ఉంటే.. బియ్యం ధరలు మాత్రం బెంబేలెత్తిస్తున్నాయి. ప్రభుత్వ లెక్క ప్రకారం 100 కేజీల ధాన్యం బస్తా రైతు వద్ద రూ.2300.ఒక ధాన్యం బస్తా ఆడిస్తే దాదాపుగా 65 కేజీల బియ్యం వస్తాయి.ఉభయగోదావరి జిల్లాలకు ధాన్యాగారమని పేరు.గోదావరి జిల్లాల్లోనే పెరుగుతున్న బియ్యం ధరలు చూసి బెంబేలెత్తిపోతున్నారు.అంచనాలకు మించి ధాన్యం దిగుబడి ఉంటున్నా ధరలు మాత్రం తగ్గుముఖం పట్టడంలేదు.గత ఐదేళ్ల వైసీపీ హయాంలో బియ్యం ధరలు పూర్తిగా అదుపు తప్పాయి. మిల్లర్లు, వ్యాపారులు కలిసి ధరలు ఇష్టానుసారం పెంచేస్తున్నారు. వినియోగదారుడికి బియ్యం చేరేసరికి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

మిల్లర్ల మాయాజాలం

రైస్ మిల్లర్లు సిండికేట్లుగా మారిపోయి ధరలు నిర్ణయిస్తున్నారు. ఒకనాడు మూతబడిన రైస్ మిల్లింగ్ పరిశ్రమ నేడు మళ్లీ పుంజుకోవడానికి అదే కారణం. ఇష్టానుసారం లైసెన్స్‌లు ఇచ్చేయడంతో కొత్తకొత్త బ్రాండ్లు మార్కెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. రేషన్ బియ్యం గ్రైండింగ్ చేసి రంగు రంగుల సంచుల్లో ప్యాకింగ్ చేసి విక్రయించేస్తున్నారు. రైస్ మిల్లులే మాయాజాలానికి అడ్డాలుగా మారిపోయి.. నేడు రైస్ మిల్లింగ్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా మారిపోయింది. బియ్యం కొట్లోకి వెళ్లి చూస్తే ఎన్నో బ్రాండ్లు.వాటిలో సూపర్‌ఫైన్, ఎక్స్‌పోర్ట్, సూపర్ ప్రీమియం,ప్రీమియం ఎక్స్‌పోర్ట్ అంటూ విభజిస్తూ రేట్లు బాదేస్తారు. ఉదాహరణకు సార్టెక్ అనేది ఓ జపాన్ కంపెనీ యంత్రం పేరు. కానీ బియ్యం బస్తాలపై సార్టెక్, సార్టెక్స్ అని అక్షరాలు మార్చి ముద్రిస్తూ అదేదో ఇంకో రకం బియ్యం మాదిరిగా ధరలు పిండుతున్నారు. విజిలెన్స్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో రేషన్ బియాన్ని పాలిష్ చేసి బియ్యం దుకాణాల ద్వారా బ్రాండెడ్ బియ్యంగా విక్రయిస్తున్నారు. నాణ్యమైన సరుకులో నాసిరకం బియ్యం కలగలిపేసి విక్రయించేస్తారు. 26 కేజీల బియ్యం బస్తాలో నాలుగు కేజీల ఇతర రకాలు కలిపేసినా రూ.100ల పైనే లాభం వస్తుంది. దీంతో ప్రస్తుతం బియ్యం దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.జిల్లాలో కనీసం 2 వేల షాపులపైనే ఉంటాయని సమాచారం.నాలుగేళ్ల కిందట పౌర సరఫరాల శాఖ నియంత్రణను ప్రభుత్వం తొలగించడంతో దుకాణాల సంఖ్యకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఇక నాణ్యత లోపాలను పరీక్షించి చర్యలు తీసుకోవాల్సిన శాఖలూ పట్టనట్టు ఉంటున్నాయి. దీంతో ధరల్లో వ్యాపారులు, మిల్లర్ల ఇష్టారాజ్యమైపోయింది.

ఇంతలో.. అంత తేడానా?

గత టీడీపీ ప్రభుత్వంలో 25 కేజీల పీఎల్ బియ్యం బస్తా 800.. లలిత అయితే రూ.850.. కర్నూలు సోనా 26 కిలోల బస్తా రూ.1200 ఉండగా ఇప్పుడు కర్నూలు సోనా రూ.1800- 2000కి చేరింది. బియ్యంలో మరో మాయాజాలం పాతవి. ఏడాది పాతవి, రెండేళ్ల పాతవి, ఫైన్, సూపర్ ఫైన్ అంటూ విడదీసి రేట్లు నిర్ణయిస్తున్నారు. అదే రకం బియ్యం ఏడాది పాతవైతే రూ.200, రెండేళ్ల పాతవైతే మరో రెండొందల ఎగస్త్రాకు అమ్మేస్తున్నారు. రెండేళ్ల పాతవి బీపీటీ రకం క్వింటా రూ.6000 -7000 వరకూ విక్రయిస్తున్నారు. సాంబ రకం వంద కిలోలు రూ.5000పైన, పీఎల్ రూ.4500పైన ,దం పుడు బియ్యం రూ.6000లకు అమ్ముతున్నారు. నాసిరకం బియ్యం కావాలన్నా రూ.40వెచ్చించాల్సిన రోజులు దాపురించాయి. ఆఖరికి సంచుల బట్టి కూడా ధరలు పెట్టారు. గుడ్డసంచి,ప్లాస్టిక్ సంచి..సోనామసూరిలో బ్లూ, గ్రీన్ రకాలంటూ ధరలు పెంచడానికే అన్నట్టు విభజన చేస్తున్నారు. బాస్మతి మినహా మిగతా అన్ని రకాల బియ్యం విదేశీ ఎగుమతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు తగు చర్యలకు దిగితే బియ్యం ధరలు అదుపులోకి వచ్చే అవకాశం ఉంది. బెనిన్, చైనాతో సహా సుమారు 100 దేశాలకు భారత్ బియ్యాన్ని ఎగుమతి చేస్తోంది. ప్రపంచ బియ్యం వ్యాపారంలో భారత్ వాటా 40శాతం పైనే ఉంది.ఎగుమతులు పెరిగిపోవడంతో పంట పండించే మనకూ ధరలూ పెరుగుతున్నాయి.

నేటికీ తెల్లకాగితంపైనే బిల్లు

బియ్య దుకాణాల వైపు కన్నెత్తి చూడడానికి వాణిజ్య పన్నుల శాఖకు ఖాళీ లేకుండా పోయింది. ఆ శాఖ ఉందని విజిలెన్సు వారూ పట్టించుకోవడం మానేశారు. ప్రజలకు రోజూ అత్యంత అవసరమైనది బియ్యం. అన్నం లేకుండా పూట గడవదు. అంతటి ప్రాధాన్యం ఉన్న నిత్యావసరంపై యంత్రాంగానికి పెద్దగా పట్టింపు కనబడడం లేదు. బియ్యం దుకాణాల్లో.. పెద్ద దుకాణాల్లో సైతం ధరల పట్టికలు ఎక్కడా కనిపించవు. ఏ రకం బియ్యం ఉన్నాయో కూడా తెలియదు. ఈసారి తీసుకెళ్లిన బియ్యం మళ్లీ సారికి దొరకవు. వ్యాపారులు చెప్పిన దానికి వినియోగదారుడు తలాడించి దేవుడిపై భారం వేసి కొనుక్కోవాల్సిందే. ఏ రకం బియ్యం ఎంతకు అమ్మాలనే దానిపై ప్రభుత్వ నియంత్రణ,ధరల నిర్ణయం లేదు. బిల్లులు ఇవ్వకపోయినా అధికారులకు కనబడదు. బిల్లు అడిగితే ఓ చీటీపై రాసి స్తారు. దానిపై ఏరకం, ఏబ్రాండు అనేది ఉండనే ఉండవు. ఎక్కడా శాంపిల్స్ కనిపించవు. ఉదాహరణకు సీతంపేట ప్రాంతంలోని ఓ పెద్ద బియ్యం కొట్టులో చాలా ఏళ్ల నుంచీ ఇలాంటి చీటీల వ్యాపారం జరుగుతోంది. రోజూ లక్షల రూపాయల్లో విక్రయాలు జరిగే ఇలాంటి పెద్ద షాపులోనే పరిస్థితి ఏళ్ల తరబడి ఇలా ఉంటే ఇప్పటి వరకూ జనం జేబులకు పడిన చిల్లులు, ప్రభుత్వ గల్లాపెట్టెకు పడిన కన్నం లెక్కలు వేస్తే కళ్లు బైర్లుకమ్మక తప్పదు. బియ్యం విక్రయాలపై యంత్రాంగం ఉదాసీనంగా ఉండడంతో విని యోగదారుడికి బియ్యం చుక్కలు చూపిస్తున్నాయి.



స్నేక్ స్నాచర్ పట్టుకున్న తాచుపాము

తాచుపాము పగ

గోకవరం, జూలై 29 : పాము పగపడితే వదలదు.. తరుముకుంటూ ఇంటి వరకూ వచ్చేస్తుంది. ఈ మాట తరచూ వింటుంటాం. ఈ సంఘటన వింటే ఆ మాట నిజం అని నమ్మకతప్పదు మరి.. గోకవరం మండలం అచ్చుతాపురం గ్రామానికి చెందిన దడాల కన్నయ్య పుట్టగొడుగుల కోసం సోమవారం ఉదయం పొలానికి వెళ్ళాడు. పుట్ట గొడుగులను అన్వేషించే క్రమంలో తాచుపాము కన్నయ్యకు తారసపడి బుసలుకొట్టింది. భయంతో కన్నయ్య ఇంటికి పరిగెత్తుకుంటూ వచ్చే శాడు.కాసేపటికి ఆ పాము కన్నయ్య ఇంటి పై కప్పు (చూరు)లో దాగి బుసలు కొడుతూ కనిపించింది. దీంతో భయాందోళనకు గురైన కన్నయ్య, అతని కుటుంబీకులు ఇంటి నుంచి బయటకు వచ్చేశారు. వెంటనే స్నేక్ స్నేచర్‌కు సమాచారం అందించారు. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన స్నేక్ స్నేచర్ ఇంటి పై కప్పులో దాగి ఉన్న పామును ఎంతో చాకచక్యంగా పట్టుకోవడంతో కన్నయ్య,అతని కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టుబడిన పాము గోధుమత్రాచు అని స్థానికులు గుర్తించారు.ఆ తరువాత పామును అడవిలో విడిచిపెట్టేసినట్టు స్థానికులు తెలిపారు.

జేసీ తేజ్ భరత్ రిలీవ్

ఇన్‌చార్జిగా డీఆర్వో నరసింహులు

రాజమహేంద్రవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల బదిలీ అయిన జేసీ ఎస్.తేజ్‌భరత్ సోమవారం బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. తన బాధ్య తలను డీఆర్వో జి.నరసింహులుకు అప్పగించారు. కొత్త జేసీ విధుల్లో చేరే వరకూ నరసింహులే ఇన్‌చార్జి జేసీగా వ్యవహరిస్తారు. జిల్లా జేసీగా హిమాన్స్ కౌశిక్‌ను నియమించినా ఇంత వరకూ విధుల్లో చేరలేదు. జేసీగా కాకుండా వేరే పోస్టుకు ప్రయత్నిస్తున్నారని కొందరు, త్వరలో విధుల్లో చేరతారని మరికొందరు చెబుతున్నారు. తేజ్‌భరత్‌ను కడప మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించినా ఇష్టంలేదు. ఆయన కూడా వేరే పోస్టుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఇక్కడ రిలీవ్ అయినా కడపలో జాయిన్‌కాలేదు.

1న పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం, జూలై29(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లు ఆగస్టు 1 ఉదయం 5 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటివద్దకు వెళ్లి సచివాలయ ,ఇతర ఉద్యోగులు పంపిణీ చేయాలని కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. జిల్లాలోని ఎంపీడీవోలతో సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 2,40,595 మందికి రూ.102,54,77,500 పంపిణీ చేయనున్నట్టు చెప్పారు.మొదటి రోజే 99 శాతం పంపిణీ చేయాలని, సాంకేతిక సమస్య తలెత్తితో మరుసటిరోజు ఇవ్వాలని స్పష్టం చేశారు. జిల్లాలో 3,900 మంది సచివాలయ ఉద్యోగులు, 300 మంది ఇతర ప్రభుత్వ ఉద్యోగులు కలిపి మొత్తం 4200 మంది ఉద్యోగులు పంపిణీ చేస్తారన్నారు. ఒక్కో ఉద్యోగి 50 నుంచి 90 మంది పింఛనుదార్లతో మ్యాపింగ్ చేసినట్టు చెప్పారు.





అనంతలక్ష్మి అమ్మవారికి వజ్ర కిరీటం

వచ్చేనెల 6న సమర్పణ

అన్నవరం, జూలై 29:
కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవం సత్యదేవుడు వజ్రకిరీటధారియై భక్తులకు దర్శనమిస్తున్నారు. దేవేరి అనంతలక్ష్మి అమ్మవారి అలంకరణకు వజ్ర కిరీటం, స్వామి, అమ్మవార్లు ఇద్దరికీ వజ్ర కర్ణాభరణాలను లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ తయారు చేయించారు. కిలో బంగారం, 130 క్యారెట్ల వజ్రాలతో రూ.2కోట్లతో వీటిని తీర్చిదిద్దినట్టు అధికారులు తెలిపారు. వాటిని స్వామివారి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 6న దాత సమర్పిస్తారని దేవస్థానం అధికారులు వెల్లడించారు. సత్యదేవుడి ధ్వజస్తంభం బంగారు పూత కార్యక్రమాన్ని కూడా అదే రోజు ఏర్పాటు చేస్తే బాగుంటుందని నెల్లూరుకు చెందిన దాతకు దేవస్థానం అధికారులు సమాచారం ఇచ్చారు. అయితే దేవదాయ శాఖ మంత్రి ద్వారా ఈ కార్యక్రమం చేపట్టాలనే ఆలోచనలో ఉన్నట్టు దాత చెప్పారు.

సత్యదేవుని హుండీల ఆదాయం

రూ.1.27 కోట్లు

30 రోజులకు వచ్చిన మొత్తమిది

175.2 గ్రాముల బంగారం, 665 గ్రాముల వెండి

అన్నవరం, జూలై 29:
రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రమోహన్, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, దేవదాయ శాఖ ఉప కమిషనరు రమేష్‌బాబు పర్యవేక్షణలో లెక్కించారు. 30 రోజులకు రూ.1,27,20,345 నగదు, 175.2 గ్రాముల బంగారం, 665 గ్రాముల వెండి లభించాయి. యుఎస్ఏ 332 డాలర్లు, కువైట్ 26 దిరహమ్స్, న్యూజిలాండ్ 40 డాలర్లతో పాటు పలు దేశాల కరెన్సీ వచ్చాయి. లెక్కింపులో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

జేఎన్టీయూకేలో అంతర్గత బదిలీలు



» ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రవీంద్రనాథ్

జేఎన్టీయూకే, జూలై 29: జేఎన్టీయూకే పరిపాలనా సంస్కరణల్లో భాగంగా ఇన్‌చార్జి ఉప కులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్, పలువురు అధికారులను అంతర్గతంగా బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. యూసీఈకే విభాగం గణిత ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ వి.రవీంద్రనాథ్‌ను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఆయన గతంలో అడ్మిషన్స్ డైరెక్టరుగాను, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గాను పనిచేశారు. సివిల్ ప్రొఫెసర్ ఏసురత్నాన్ని ఇన్‌చార్జి డీఏపీగాను, యూసీఈకే భౌతికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జి.పద్మజారాణిని ఇన్‌చార్జి డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్(డీఈ)గాను బదిలీ చేశారు. ఇప్పటివరకు డీఈగా విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ బి.బాలకృష్ణను ఇన్‌చార్జి డీఏపీగాను, మెకానికల్ విభాగం ప్రొఫెసర్ స్వర్ణకుమారిని ఎఫ్‌యూఏఆర్ ఇన్‌చార్జి డైరెక్టరుగాను, ప్రొఫెసర్ ఎన్.బాలాజీని లీగల్, ప్రభుత్వ వ్యవహారాల ఇన్‌చార్జి డైరెక్టరుగాను, యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్‌ను ఐక్యూఏసీ ఇన్‌చార్జి డైరెక్టరుగాను, కె.పద్మప్రియను ఫార్మసీ కోర్సుల ప్రత్యేకాధికారిగాను నియమించారు. అలూమ్ని రిలేషన్స్ అధికారిగా పనిచేసిన ఎస్.మోహన్‌రావును యూసీఈకే ప్రిన్సిపాల్‌గా, ప్రొఫెసర్ దీక్షితులును గణిత విభాగాధిపతిగా, రసాయన శాస్త్రం విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.సత్యవేణిని భౌతిక శాస్త్రం విభాగాధిపతిగా నియమిస్తూ రిజిస్ట్రార్ ఎల్.సుమలత ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియామకమైన రవీంద్రనాథ్‌ను, ఇన్‌చార్జి డైరెక్టర్లను ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

పిల్లల అక్రమ రవాణా అడ్డగింత

ఆర్పీఎఫ్ పోలీసులకు డీఆర్ఎం ప్రశంసలు

రాజమహేంద్రవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బాలల అక్రమ రవాణాను అడ్డుకున్న రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) పోలీసులను రైల్వే ఉన్నతాధికారులు సోమవారం ప్రశంసించారు. ఈ నెల 27న రాజమహేంద్రవరం-తుని స్టేషన్ల నడుమ ఆర్పీఎఫ్, ఏపీవో బచ్‌పన్ బచావో ఆందోళన్ (ఆంధ్రప్రదేశ్) సిబ్బంది సంయుక్తంగా రైళ్లలో తనిఖీలు చేశారు. ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్‌లో 8 మంది బాలలను గుర్తించారు. వారు మరో నలుగురు గుర్తు తెలియని పెద్ద వారితో కలిసి వెళ్తున్నారు. ప్రయాణానికి కారణాలను బాలలు సరిగా వెల్లడించలేకపోవడంతో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో దింపి విచారించారు. విజయవాడ, చెన్నై, తిరుప్పూర్‌తో పాటు కేరళలోని వివిధ ప్రాంతాల్లో బాల కార్మికులుగా పని చేయించుకోడానికి తీసుకెళ్తున్నారని ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. బాలలను బాలల సంక్షేమ సమితికి అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది. సమయానికి స్పందించి బాలలను కాపాడడంలో చొరవ చూపిన సీనియర్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బి.తోకల, ఆర్పీఎఫ్ రాజమండ్రి పోస్ట్ కమాండర్ సైదయ్య తదితరులను డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

సామర్లకోట, జూలై 29: కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణం కుమ్మరి వీధికి చెందిన పెదపూడి వెంకటరమణ ఒక్కడే తాటాకు పాకలో ఉంటూ వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి, సోదరులు హైదరాబాద్‌లో కూలి పనులు చేసుకుంటూ అక్కడే జీవనం సాగిస్తున్నారు.



మద్యానికి బానిసైన వెంకటరమణ తన పరిసరాల్లో అందరితోనూ గొడవపడుతూ, దుర్భాషలాడుతూ ఉంటాడు. ఆదివారం రాత్రి కుమ్మరి వీధికి చెందిన కొందరు వ్యక్తులతో వివాదాలకు దిగిన వెంకటరమణను చితక్కొట్టినట్టు సమాచారం. అందుకు సాక్ష్యంగా మృతుడు ధరించిన వస్త్రాలకు బురద అంటుకుని ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. రాత్రి వివాదం అనంతరం ఏమి జరిగిందో ఎవరికీ తెలియదు. సోమవారం ఉదయం ఇరుపక్కల వారు చూసేసరికి వెంకటరమణ చనిపోయి ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలికి సామర్లకోట సీఐ సురేష్ తదితర పోలీసులు చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు కేసు నమోదు చేశారు. కాగా గత రాత్రి వెంకటరమణతో వివాదానికి దిగిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది.



కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద

తగ్గుతున్న వరద ఉధృతి

» ధవళేశ్వరం వద్ద 14.40 అడుగులకు చేరిన నీటిమట్టం

» 13,92,438 క్యూసెక్కులు సముద్రంలోకి

» భద్రాచలం వద్ద ప్రమాద హెచ్చరికలు ఉపసంహరణ

ధవళేశ్వరం, జూలై 29: గోదావరి ఉధృతి తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం వద్ద 12 గంటల వ్యవధిలో అడుగు మేర తగ్గింది. ఇదే ఒరవడి కొనసాగితే మంగళవారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించే స్థాయికి నీటిమట్టం తగ్గవచ్చు. ఆదివారం రాత్రి 8గంటలకు 15.80 అడుగుల వరకు నీటిమట్టం పెరిగింది. ఈ సమయంలో అత్యధికంగా 16,09,099 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహించింది. 8 గంటల పాటు నిలకడగా కొనసాగి సోమవారం తెల్లవారుజామున తగ్గుముఖం పట్టింది. క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం రాత్రి 7గంటలకు 14.60 అడుగులకు చేరింది. ఎగువన భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గుతూ ఆదివారం రాత్రి 10గంటలకు 47.70 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. సోమవారం రాత్రికి నీటిమట్టం 42.8 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు.

ఎగువన అన్ని ప్రాంతాల్లో నీటిమట్టాలు తగ్గాయి. సోమవారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద 10.04 మీటర్లు, పేరూరు వద్ద 15.60 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 11.44 మీటర్లు, భద్రాచలం వద్ద 43 అడుగులు, కూనవరం వద్ద 20.66 మీటర్లు, కుంట వద్ద 12.18 మీటర్లు, పోలవరం వద్ద 13.36 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.99 మీటర్లు నమోదయ్యాయి.

డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదల నిలిపివేత

మోతుగూడెం, జూలై 29: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదలను సోమవారం నిలిపివేశారు. ఈ సందర్భంగా జెన్‌కో ఈఈ బాలకృష్ణ మాట్లాడుతూ గత రెండు రోజులుగా డొంకరాయి జలాశయం ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గడంతో వలసగెడ్డ, పాలగెడ్డ, వాగుల నుంచి వచ్చే ఇన్‌ఫ్లోస్ తగ్గాయన్నారు. సోమవారం ఉదయం 7గంటల ప్రాంతంలో డొంకరాయి నీటిమట్టం 1034.10అడుగులకు తగ్గిందన్నారు. దీంతో అప్పటివరకు నాలుగు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న 13,124 క్యూసెక్కుల నీటిని రెండు గేట్లను పూర్తిగా మూసివేసి మరో రెండు గేట్ల ద్వారా 4,258 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగించారు. ఉదయం 11 గంటలకు నీటిమట్టం 1034 అడుగుల వద్ద స్థిరంగా ఉండడంతో మిగతా రెండు గేట్లను కూడా పూర్తిగా మూసివేసి నీటి విడుదలను నిలిపివేశామని ఈఈ తెలిపారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం పవర్ కెనాల్ ద్వారా 3వేల క్యూసెక్కులు డొంకరాయి విద్యుత్ సరఫరా అనంతరం విడుదలవుతుందన్నారు. డొంకరాయి జలాశయంలో 12.398 టీఎంసీల



నీటి నిల్వలు ఉన్నాయని ఈఈ విజయ్‌కుమార్ వివరించారు.



తెల్లవార్లూ తాటిచెట్టుపై ఉన్న నవీన్

నిద్రమత్తులో వరద నీటిలోకి



» నిండా మునిగిన టిప్పర్

» తెల్లవార్లూ తాటిచెట్టుపైనే డ్రైవర్ నవీన్

» ఉదయం గమనించి ఒడ్డుకు చేర్చిన జాలర్లు

చింతూరు, జూలై 29: ఓ టిప్పర్ డ్రైవర్ తెల్లవార్లూ తాటి చెట్టుపై ఉండి తన ప్రాణాలు కాపాడుకున్నాడు. వివరాలు ఇలా వున్నాయి... తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన డ్రైవర్ మర్రి నవీన్ టిప్పర్‌పై ఆదివారం ఒడిసాలోని జర్సిగూడ బయల్దేరాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు వచ్చేసరికి రాత్రి 11 గంటలు అయ్యింది. చింతూరు-కుయుగూరు మధ్య 326వ జాతీయ రహదారిపై వరద నీరు ఉన్న విషయాన్ని నిద్ర మత్తులో గమనించని నవీన్ ముందుకెళ్లాడు. దీంతో టిప్పర్ వరద నీటిలో మునిగింది. నిద్రమత్తు వీడిన అతడు టిప్పర్ క్యాబిన్ నుంచి కష్టంమీద బయటకొచ్చి ఈదుకుంటూ దగ్గర్లో ఉన్న తాటిచెట్టు వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో ఎటు వెళ్తే ఒడ్డుకు చేరతాడో అర్థం కాక తెల్లవార్లూ తాటిచెట్టుపైనే ఉన్నాడు. ఉదయం ఏడు గంటల సమయంలో వరద విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన జాలర్లను చూసి నవీన్ కాపాడండి అంటూ కేకలు వేశాడు. దీనిని గమనించిన జాలర్లు వచ్చి అతడిని బోటులో ఒడ్డుకు చేర్చారు.

వరద సాయాన్ని పారదర్శకంగా పంపిణీ చేయాలి

ప్రతీ బాధిత కుటుంబానికీ రూ.3వేలు అందించాలి

టెలి కాన్ఫరెన్స్‌లో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు జూలై 29: గోదావరి వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందించే రూ.3వేల సాయాన్ని పారదర్శకంగా పంపిణీ చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం రాత్రి ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబాల వారికి సాయం అందాలని ఆదేశించారు. సాయం అందలేదని ఫిర్యాదు రాకూడదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధు లు, గ్రామ స్థాయి కమిటీ సభ్యుల సమక్షంలో నగదు పంపిణీ జరగాలన్నారు. పంపిణీలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. తొలుత కూనవరం, వీఆర్ పురం మండలాల్లో, తర్వాత ఎటపాక, చింతూరు మండలాల్లో వరద బాధితులకు సాయం పంపిణీ చేయాలని ఆదేశించారు.





చోరీ ఘటనను వివరిస్తున్న సీఐ శేఖర్‌బాబు, చోరీకి గురైన వస్తువులను మీడియాకు చూపిస్తున్న దృశ్యం

కుటుంబ సభ్యుడే సూత్రధారి

చెడు వ్యవసనాలకు బానిసై నగదు, నగలు అపహరణ

ప్రత్తిపాడులో వైద్యఉద్యోగి ఇంట్లో చోరీ ఘటనలో బీటెక్ విద్యార్థితో పాటు మరో నలుగురు అరెస్టు

పదహారున్నర కాసులు బంగారం, రూ.2.50లక్షల నగదు రికవరీ

ప్రత్తిపాడు, జూలై 29: కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో వైద్య ఉద్యోగి ఇంట్లో జరిగిన చోరీ ఘటనలో కుటుంబ సభ్యుడే సూత్రధారి అయి నగదు, నగలు అపహరణలో కీలకమయ్యాడు. ఈ ఘటనలో పదహారున్నర కాసుల బంగారం, రూ.2.50 లక్షల నగదు స్వాధీనపరుచుకుని ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం సీఐ ఎం.శేఖర్‌బాబు విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.. ప్రత్తిపాడు ఫైర్ స్టేషన్ సమీపంలో నివాసముం టున్న వైద్య ఉద్యోగి మచ్చికర్ల అప్పలస్వామి ఇంట్లో ఈ నెల 25వ తేదీన చోరీ జరిగింది. ఇరవైరెండున్నర కాసుల బంగారం, రూ.3లక్షల నగదు అపహరణకు గురైనట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్పీ విక్రాంత్ పాటిల్, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో మూడు పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ప్రధాన సూత్రధారిగా వైద్య ఉద్యోగి అన్న కొడుకు మచ్చికర్ల సాయిచరణ్‌ను పోలీసులు గుర్తించారు. వ్యవసాలకు బానిసైన అతడు ఈ చోరీకి మాస్టర్ ప్లాన్ వేశాడు. అతనికి స్నేహితులు అనుగుల అజయ్, వలసాని ధనుష్, సత్యసాయి, బన్ని సహకరించారు. సాయికిరణ్ తరుచూ ఇంటికి వచ్చి తాళాలు భద్రపరిచే చోటును గమనించి స్నేహితుల సహాయంతో ఇంట్లోకి చొరబడి నగదు, నగలు అపహరించుకుపోయాడు. వీటిని కాకినాడలో సాయి చరణ్ స్నేహితుడు బన్ని వద్ద భద్రపరిచారు. నిందితులను విచారించగా దొంగతనానికి పాల్పడినట్టు అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.2.50 లక్షల నగదు, పదహారు కాసులు బంగారం స్వాధీనం చేసుకుని సోమవారం అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి ఎస్ఐలు ఎం.పవన్‌కుమార్, జి.సతీష్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్ బాబు కోరారు. యువత సన్మార్గంలో నడిచేందుకు తల్లిదండ్రుల అజమాయిషీ కూడా ఉండాలన్నారు. ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో దొంగతనాల నివారణకు రాత్రి పూట గస్తీని ముమ్మరం చేశామని చెప్పారు.

కిలోన్నర గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఐదు గురిలో ముగ్గురు యువకులను సోమవారం అరెస్టు చేసినట్టు తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ తెలిపారు. వివరాలు ఇలా వున్నాయి... ఏజెన్సీలోని రంపచోడవరం ప్రాంతానికి చెందిన పండు (టామ్) గంజాయిని తీసుకొచ్చి నగరంలోని వీరభద్రా నగర్‌కి చెందిన జలగడుగుల నరేంద్రకు రంపచోడవరంలో విక్రయిస్తాడు. అతడి వద్ద నుంచి తాడితోట రెల్లివీధికి చెందిన ధనాల భవానీశంకర్, షెల్టాన్ హోటల్ సమీపంలోని వీరభద్రాపురానికి చెందిన బాదంపూడి శ్యాం దుర్గాప్రసాద్, గోరక్షణపేటకు చెందిన రొడ్డా రాకేశ్ కొనుగోలు చేస్తారు. ఈ క్రమంలో గోదావరి గట్టున ఉమామార్కండేయ స్వామి గుడి సమీపంలోని పిండాల రేవులో గంజాయి కలిగి ఉండడంతో పాటు విక్రయాలు జరుపుతున్న నరేంద్ర, భవానీశంకర్, దుర్గాప్రసాద్‌లను వన్‌టౌన్ ఎస్ఐ ఎం.కేశవరావు సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పండు, రాకేశ్ కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో గాలిస్తున్నారు. గంజాయి వాడకం, విక్రయం, నిల్వ, రవాణాపై ప్రత్యేక బృందాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ చెప్పారు. గంజాయి బ్యాచ్‌ను పట్టుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కేశవరావు, సిబ్బందిని ఆయన ప్రశంసించారు.

గంజాయితో బాలుడి అరెస్టు

తుని రూరల్, జూలై 29: తుని రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయితో ఓ బాలుడు పట్టుబడినట్టు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. అనంతపురం పట్టణానికి చెందిన ఆ బాలుడు రైలు మార్గాన తుని చేరుకుని అక్కడి నుంచి నర్సీపట్నం వెళ్లి గంజాయి కొనుగోలు చేశాడన్నారు. 4.900 కిలోల గంజాయితో తుని చేరుకుని రైలు ఎక్కే క్రమంలో పట్టుబడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకుని ఆరా తీయగా గంజాయి తరలింపులో సూత్రధారులుగా ఉన్న మరో ఇద్దరు పేర్లు వెల్లడించాడు. వారిద్దరూ అనంతపురానికి చెందిన వారే అని, పట్టుకునేందుకు ఒక బృందం అక్కడకు వెళ్లారని సీఐ చెప్పారు.



మంగ మృతదేహం

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

జగ్గంపేట, జూలై 29:
కాకినాడ జిల్లా జగ్గంపేట నెహ్రూ కాలనీకి చెందిన కింతాడ మంగ (40) విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆమె తన ఇంటి వద్ద నీళ్లు పట్టేందుకు మోటారు వైర్లను ప్లగ్‌లో పెడుతున్న సమయంలో విద్యుత్ షాక్ తగిలింది. దీంతో కుప్పకూలి మృతి చెందినట్టు ఆమె భర్త తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దమ్మాయికి పెళ్లికాగా రెండో అమ్మాయికి పెళ్లి కావాల్సి ఉంది. ఈ ఘటనపై జగ్గంపేట ఏఎస్ఐ నూకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం చట్టి గ్రామంలో తలదాచుకునేందుకు వరద బాధితులు వేసుకున్న గుడారాలు

ఇంకా వరద నీటిలోనే

అంధకారంలో 76 ఆవాసాలు

49 రహదారులు మూసివేత

కొనసాగుతున్న సహాయక చర్యలు

చింతూరు, జూలై 29: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్‌లోని లోతట్టు గ్రామాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. సోమవారం భద్రాచలం వద్ద గోదావరి 43.20 అడుగుల మేర ప్రవహిస్తోంది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 39 అడుగులకు చేరుకుంది. వరద ఉధృతి తగ్గుతున్నా గ్రామాలు, రహదారులు ముంపులోనే ఉన్నాయి. చట్టి గ్రామంలో వరద బాధితులు తాత్కాలికంగా ఉండేందుకు గుడారాలు వేసుకున్నారు. డివిజన్ పరిధిలోని 121 ఆవాసాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయగా సోమవారం సాయంత్రం 45 ఆవాసాలకు పునరుద్ధరించారు. మిగిలిన 76 ఆవాసాలు అంధకారంలో మగ్గుతున్నాయి. వరద నీటిలో వున్న 49 ప్రధాన రహదారులపై రాకపోకలను నిలిపివేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ నేతృత్వంలో వరద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

శెభాష్ సత్తిబాబు

» వాగు దాటి విధులు నిర్వర్తించిన లైన్‌మన్

» అభినందించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



రౌతులపూడి, జూలై 29: కాకినాడ జిల్లా జగ్గంపేట డివిజన్ రౌతులపూడి సెక్షన్ గుమ్మరేగుల పరిధిలోని కొట్టాం 11 కేవీ ఫీడర్ కొద్ది రోజులుగా తరచూ బ్రేక్‌డౌన్ అవుతోంది. ఈదురుగాలులకు చెట్లు విరిగిపడి విద్యుత్ తీగలపై పడడంతో అస్తమానూ సరఫరా నిలిచిపోతోంది. దీంతో విద్యుత్ వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కూడా ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడి బ్రేక్‌డౌన్ అయ్యింది. ఇటీవలి భారీ వర్షాలకు గుమ్మరేగుల ఏటికాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ కాలువ దాటి వెళ్తే తప్ప విద్యుత్ సమస్య పరిష్కారం కాదు. లైన్‌మన్ కారం సత్తిబాబు నడుముకు తాడు కట్టుకుని వైర్లపైపడిన చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు కృషి చేశాడు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మధ్యమాల్లో వైరల్‌గా మారింది. దానిని చూసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తించిన లైన్‌మన్ సత్తిబాబును ప్రశంసించారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

వరద తగ్గి... బురద మిగిలింది




ఇల్లు శుభ్రం చేసుకుంటున్న బాధితుడు, శబరి బ్రిడ్జి వద్ద తాచుపాము

కూనవరం, జూలై 29: కూనవరం మండల ప్రజలను పది రోజులుగా ఇబ్బందిపెట్టిన వరద సోమవారం తగ్గుముఖం పట్టింది. కొన్ని గ్రామాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. వరద తగ్గుతూ పెరుగుతూండడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పట్లేదు. నిత్యావసర వస్తువులు, పాలు కరువయ్యాయి. బ్యాంకులు ఆరు రోజులుగా మూతపడ్డాయి. బడులు సైతం తెరుచుకోలేదు. కూనవరంలో 45 అడుగుల మేర గోదావరి ప్రవహిస్తోంది. వరద తగ్గిన గ్రామాల్లోని ఇళ్లల్లో బురద మిగిలింది. బాధితులు ఇళ్లు కడుక్కోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లల్లోకి పాములు ప్రవేశిస్తున్నాయి. సోమవారం శబరి బ్రిడ్జి వద్దకు గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొచ్చింది. కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.



వరద బాధితులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజారావు

'పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తాం'

చింతూరు, జూలై 29: పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో పాటు ప్యాకేజీ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడు పొంగి రాజారావు పేర్కొన్నారు. సోమవారం ఎనిమిది మందితో కూడిన బీజేపీ బృందం చింతూరు మండలంలో పర్యటించింది. బాధితులను పరామర్శించిన అనంతరం రాజారావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.1,200 కోట్లు కేటాయించింది. వరద బాధితులందరికీ సకాలంలో రేషను, నిత్యావసర వస్తువులు అందజేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కోరతా మన్నారు. చింతూరులో 100 పడకల ఆసుపత్రి ఆవశ్యకతను వైద్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. పర్యటనలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు డీవీఎస్ రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి పాయం వెంకయ్య, నాయకులు ఉడుముల వెంకటరమణ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి, జనసేన నాయకుడు తీగల రవి పాల్గొన్నారు.



రైతులకు దాణా పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ మంగేశ్వరరావు

పశువులకు దాణా పంపిణీ

ఎటపాక, జూలై 29: గోదావరి వరద ముంపు గ్రామాల్లో పశువులకు ఆహారంగా దాణాను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది. గౌరిదేవిపేట పశువైద్యశాలలో పశువుల యాజమానులకు సోమవారం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహులు, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు దాణా పంపిణీ చేశారు. మండలంలో ముంపునకు గురైన గ్రామాలకు మొత్తం కలిపి 50 టన్నుల దాణా సరఫరా జరిగిందని మండల పశువైద్యాధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ రంపచోడవరం డిప్యూటీ డైరెక్టర్ హమ్మద్ షరీఫ్, ఏడీ వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఉలవల శివకనకరాజు, టీడీపీ నాయకులు కణితి మధు, అమరవరపు రామ తదితరులు పాల్గొన్నారు.



చేపల వేటకు వెళ్లొద్దని సూచిస్తున్న ఎస్‌ఐ శివకుమార్

పర్యాటకుల సందర్శన నిలిపివేత

మోతుగూడెం, జూలై 29: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సీలేరు, శబరి నదులతో పాటు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్పీ అమిత్ బర్దర్, చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా, చింతూరు సీఐ గజేంద్రకుమార్ ఆదేశాల మేరకు మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోకులేరు వాగు వద్ద, వ్యూ పాయింట్, పొల్లూరు వాటర్ ఫాల్స్, పుష్ప బ్రిడ్జి వద్ద, పాయింట్ వద్ద పోలీసు గస్తీ తో పాటు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సీలేరు, శబరి ఉధృతి కారణంగా చేపల వేట ప్రమాదకరమని, తగ్గే వరకు చేపల వేట చేయవద్దని డొంకరాయి స్టేషన్ పరిధిలోని బెంగాలి క్యాంప్, మర్రిగూడెం, పాలగెడ్డ గ్రామాల్లో ఎస్‌ఐ శివకుమార్ సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



రంపచోడవరం, జూలై 29: ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొండవాగులు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో వాగులు, పర్యాటక ప్రదేశాల్లో సీఐ వాసా వెంకటేశ్వరరావు బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు మండలంలోని ఐ.పోలవరం పర్యాటక కేంద్రం, పాత సీతపల్లి రోడ్డు సమీపంలో ఉన్న వాగు, భూపతిపాలెం రిజర్వాయర్‌లోని పర్యాటక ప్రదేశాలు, దేవీపట్నం గండి పోశమ్మ ఆలయం, దండంగి వాగు ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టారు. ప్రజలు వాగులు దాటే ప్రయత్నం చేయొద్దని, చేపల వేటకు వెళ్లొద్దన్నారు.

చింతూరు: చింతూరు డివిజన్ పరిధిలో చేపల వేట నిషేధించినట్టు ఏఎస్పీ రాహుల్ మీనా సోమవారం ఒక ప్రకటనలో గోదావరి, శబరి, సీలేరు నదులతో పాటు పలు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. వరద తీవ్రత తగ్గేంత వరకు ఈ నిషేధం అమలులో ఉంటుందన్నారు.

పోలవరం భూకుంభకోణంపై సీబీఐ, ఈడీ, విజిలెన్స్ దర్యాప్తు చేయాలి

దేవీపట్నం, జూలై 29: పోలవరం భూ కుంభకోణంలో ప్రధాన సూత్రధారులపై ఇంతవరకు చార్జిషీటు దాఖలు చేయలేదని... సీబీఐ, ఈడీ, విజిలెన్స్ దర్యాప్తు చేపట్టాలని టీడీపీ దేవీపట్నం మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.మెహర్‌బాబాగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

గాయపడ్డ ఆవుదూడకు చికిత్స

చింతూరు, జూలై 29: చింతూరులో మినీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఒక ఆవు దూడ తీవ్రంగా గాయపడింది. అది తన బిడ్డ చుట్టూ తిరుగుతుండగా గమనించిన స్థానిక యువకులు పరాంకుశం రవీంద్రనాథ్, ప్రదీప్ పశు వైద్య శాఖకు సమాచారం అందించారు. ఆ యువకుల సహకారంతో ఆవు దూడకు పశు వైద్యులు చికిత్స చేశారు.

నేలకొరిగిన భారీ వృక్షం

మోతుగూడెం, జూలై 29: మోతుగూడెం పరిధిలో పది రోజులగా కురుస్తున్న వర్షాలకు మల్లవరం ఫోర్‌బై మార్గమధ్యంలో భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి: ఆర్డీవో

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 29 : ప్రజల నుంచి వచ్చే అర్జీలను సంబంధిత విభాగాల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని రాజమహేంద్రవరం ఆర్డీవో ఏ.చైత్ర వర్షిణి అన్నారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో ఏడు అర్జీలు స్వీకరించారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

» ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

ధవళేశ్వరం, జూలై 29: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో దివ్యాంగుల సమస్యలను ప్రస్తావిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు స్థానిక బధిరుల ఆశ్రమ పాఠశాల గురించి ప్రస్తావించడంతో ఆ సంస్థ నిర్వాహకురాలు గంటా కనకదుర్గ, విద్యార్థులతో కలిసి సోమవారం ఎమ్మెల్యేను ఆయన నివాస గృహంలో కలిసి కృతజ్ఞతలుతెలిపి సత్కరించారు. తమ విద్యార్థులకు శాశ్వత భవనాలు సమకూర్చిన ఎమ్మెల్యేకు గంటా సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. గోరంట్ల మాట్లాడుతూ పలుకు ఆశ్రమ పాఠశాలకు ప్రభుత్వ సహకారం అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు.

గోరంట్లను కలిసిన ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా

రాజమహేంద్రవరం సిటీ, జూలై 29: ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు, డైరెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. గోరంట్ల నివాసానికి సోమవారం వెళ్లి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ చల్లా, నూతన డైరెక్టర్లను గోరంట్ల అభినందించారు.



ఎమ్మెల్యే గోరంట్లను సత్కరిస్తున్న పలుకు పాఠశాల నిర్వాహకులు

కన్నమ్మతల్లి ఆలయానికి విరాళం.. స్థానిక 27వ డివిజన్ కన్నమ్మతల్లి జాతర మహోత్సవాలకు ఎమ్మెల్యే గోరంట్ల రూ.10వేలు విరాళం ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించేందుకు వెళ్లగా విరాళం అందజేశారు.

ప్రతి రోజూ ఫీల్డ్ విజిట్లకు తప్పనిసరిగా వెళ్లాలి



ప్రజల నుంచి అర్జీ తీసుకుంటున్న కమిషనర్ కేతన్ గర్గ్

» ప్రజలకు నాణ్యమైన సేవలందించండి

» అధికారులు, సిబ్బందితో కమిషనర్ కేతన్ గర్గ్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 29: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పని చేసి నాణ్యమైన సేవలందించాలని కమిషనర్ కేతన్ గర్గ్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజు అందరూ అవుట్ డోరు అధికారులు ఫీల్డ్ విజిట్లకు తప్పనిసరిగా వెళ్లాలన్నారు. ప్రత్యేకంగా వార్డు పరిపాలన కార్యదర్శులకు తమ విధులపై దిశానిర్దేశం చేశారు. వార్డు సచివాలయ కార్యదర్శులు ప్రతి రోజు వార్డు పరిధిలో 10 ఇళ్లకు వెళ్లి ఇంట్లో నివసించే వారితో మాట్లాడాలని ఆదేశించారు. వార్డు పరిపాలన కార్యదర్శి ఫిర్యాదుల పరిష్కార అధికారిగా వ్యవహరించాలన్నారు. వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శులు నగరంలోని ఆక్రమణలన్నింటి వివరాలు సేకరించాలని ఆదేశించారు. వార్డు శానిటేషన్ కార్యదర్శులు ప్రతిరోజు డ్రైన్లు పరిశీలించి చెత్తలేకుండా తొలగించాలని ఎప్పటికప్పుడు సిల్ట్ తీయించాలని, మురుగునీటి పారుదలకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. పింఛన్ల పంపిణీలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. 3వ తేదీ వరకు కార్యదర్శులకు సెలవులు లేవని తెలిపారు. అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి మాట్లాడుతూ కమిషనర్ సూచనలు ప్రతి కార్యదర్శి తూచ తప్పకుండా పాటించాలన్నారు.

కార్పొరేషన్‌లో 29 అర్జీలు స్వీకరణ

స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ కేతన్ గర్గ్ నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ప్రజల నుంచి 29 అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి టిడ్కో ఇళ్ళు, పారిశుధ్యం, పెన్షన్లు, డ్రైనేజీ సమస్యలు, ఇంటి పన్ను, వీధిదీపాల సమస్యల పరిష్కారానికి అర్జీలు వచ్చాయి. కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ పరిష్కరించాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో ఎస్‌ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్లు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో కార్యకర్తలకూ వీసీ పదవులు

» ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జులై 29: విశ్వవిద్యాలయాలను, విద్యా సంస్థలను రాజకీయాలకు ఆలవాలంగా మార్చిన ఘనుడు మాజీ సీఎం వైఎస్ జగన్ అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అనపర్తిలోని ఎన్డీయే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో పార్టీ కార్యకర్తలకు కూడా వైస్ చాన్సలర్ పదవులు కట్టబెట్టారన్నారు. ప్రతి పథకానికి జగనన్న పేరు పెట్టుకోవడమే కాకుండా ప్రచార ఆర్భాటాలకు పోయారన్నారు. ఇంత చేసిన జగన్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను విమర్శించడం, అబ్దుల్ కలామ్ పేరును పలికే హర్హత లేదనడం హాస్యాస్పదమన్నారు.

1న మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి వర్ధంతి

ఆగస్టు 1న టీడీపీ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా బిక్కవోలు మండలం బలభద్రపురంలో మెగా వైద్య శిబిరం, పందలపాకలో మూలారెడ్డి విగ్రహావిష్కరణ, బహిరంగ సభ ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి తెలిపారు. కార్యక్రమాలకు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు ఆనం, దుర్గేష్, సుభాష్, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకుడు సోము వీర్రాజు విచ్చేయనున్నట్టు చెప్పారు. పందలపాకలో జరిగే బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, బుజ్జి, చిట్టిబాబుచౌదరి పాల్గొన్నారు.



పందలపాకలో జరిగే బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

'మధ్యాహ్న భోజనం'కు సీతమ్మ పేరు హర్షణీయం

» జనసేన బిక్కవోలు అధ్యక్షుడు వీరబాబు

» శిక్షా సప్తాహ్ ముగింపు.. శుభదిన్ భోజనాలు

బిక్కవోలు, జూలై 29: మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరు పెట్టడం హర్షనీయమని జనసేన పార్టీ మండలాధ్యక్షుడు ఇందల వీరబాబు అన్నారు. ఆరికరేవుల యూపీ పాఠశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమం ముగింపు సందర్భంగా సోమవారం నిర్వహించిన శుభదిన్ భోజన కార్యక్రమానికి ఆయన సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారితో కలసి విచ్చేసి విద్యార్థులకు స్వీట్లు, అరటి పండ్లు అందజేసి వారితో కలసి సహపంక్తి భోజనం చేశారు.పందలపాక జడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో తొస్సిపూడి నందిని చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కొవ్వూరి వెంకటరెడ్డి, సర్పంచ్ కొవ్వూరి సీతారత్నం దంపతులు, హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, సబ్బారపు పద్మావతి పాల్గొన్నారు. బిక్కవోలు జడ్పీ స్కూల్, రంగాపురంలో మెయిన్, ఏపీ ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో మధ్యాహ్న భోజనంతో పాటు దాతలు సమకూర్చిన పదార్థాలను వడ్డించారు. హెచ్‌ఎంలు పి.ప్రభాకరరావు, కె.గోపాలకృష్ణ, ఎంవీ సుబ్బారావు, కానేటి అప్పలస్వామి, పొట్రు అరవాలు, కేతా గౌరిశంకర్ పాల్గొన్నారు.

రాజానగరం: స్థానిక జడ్పీ హైస్కూల్లో కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు కొణతం నరసింహారావు, మాచిరెడ్డి సత్తిరాజు, మావిరెడ్డి విమలాశ్రీనివాస్, ఇస్కాన్ తదితర దాతల సహకారంతో రోజువారీ భోజనంతో బాటు పలు పదార్థాలను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగమణి, పాఠశాల కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడియం: మండలంలోని దుళ్ల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీవైఈవో నారాయణ, మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ, దాత యన్నమని లక్ష్మిపతి, ఈదర నందబ్బు, హెచ్‌ఎం సంధ్యారాణి, వేమగిరిలో జరిగిన కార్యక్రమంలో గుత్తుల ముత్యం, యనమదల రాజు, వాశంశెట్టి బాలాజీ, అప్పారి అన్నవరం, కాంద్రేగుల సత్తిబాబు, హెచ్‌ఎం ప్రకాష్ పాల్గొన్నారు.

కోరుకొండ: మండలంలోని 54 పాఠశాలల్లో విద్యార్థులకు ఆయా గ్రామాల్లో దాతల సహకారంతో విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

355 యూరియా బస్తాల సీజ్

గోకవరం, జూలై 29: అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్న దుకాణ యజమానులపై సోమవారం విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. గోకవరం మండలం కొత్తపల్లిలోని జయలక్ష్మి ఎంటర్‌ప్రైజస్, అన్నపూర్ణ జనరల్ స్టోర్స్‌ల్లో ఎరువులు, పురుగుమందులు ప్రభుత్వ ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు దాడులు జరిపారు. రెండు దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేసి.. రూ.94,607.50ల విలువ గల 355 యూరియా బస్తాలను సీజ్ చేసారు. విజిలెన్స్ అధికారులు టి.జగన్నాదరెడ్డి, జె.భార్గవ రమేష్‌వల్లీ, లోవరాజు, శివ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కడియం, జూలై 29: కడియపులంకలో మొక్కలు ఎగుమతి చేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై దుళ్ల గ్రామానికి చెందిన ఆంద్రోతు వెర్రియ్య(41) మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. వెర్రియ్య మొక్కల ఎగుమతి కూలీగా పనిచేస్తుంటాడు. అతడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెర్రియ్య సోమవారం నర్సరీ మొక్కలు ఎగుమతి చేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌కు కుటుంబ బడ్జెట్ ప్రాతిపదిక

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 29: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌కు కుటుంబ బడ్జెట్ ప్రాతిపదికగా నిలుస్తుందని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రినిపాల్ రామచంద్ర ఆర్‌కే అన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ 2024-25కు సంబంధించిన సమగ్ర విశ్లేషణ నిర్వహించారు. సమావేశంలో వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి పీవీవీ సత్యనారాయణ, అధ్యాపకులు డీవీ నాగేశ్వరరావు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

సమయం, డబ్బు వృథా చేసుకోవద్దు: డీఎస్పీ

బిక్కవోలు, జూలై 29: కోర్టుల చుట్టూ తిరిగి సమయం, డబ్బు వృథా చేసుకోవదని డీఎస్పీ కిషోర్‌కుమార్ సూచించారు. బలభద్రపురంలో ఈనెల 27 రాత్రి దళితవాడ కమ్యూనిటీ హాలు శుభ్రం చేయడం కోసం మీటింగ్ జరుగుతుండగా రెండు వర్గాలు ఘర్షణపడి అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చేరారు. ఈ మేరకు డీఎస్పీ సోమవారం బలభద్రపురం వచ్చి దళిత పెద్దలకు కౌన్సిలింగ్ ఇచ్చారు.కేసులు పెట్టుకోవడం వల్ల సమయం, డబ్బులు ఖర్చు అవుతాయని నచ్చజెప్పడంతో వారు సానుకూలంగా స్పందించారు. డీఎస్పీ వెంట సీఐ శివగణేష్, ఎస్‌ఐ బుజ్జిబాబు వున్నారు. కాగా ఆసుపత్రి సమాచారం మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

4న చౌడేశ్వరీ అమ్మవారి జయంతోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 29: దేవాంగుల ఇలవేల్పు చౌడేశ్వరీ అమ్మవారి జయంతి మహోత్సవాలు ఆగస్టు 4న జాంపేట ఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్టు రాజమండ్రి దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు రొబ్బి విజయశేఖర్, గంపా సోమలింగేశ్వరరావు, కార్యదర్శి కాలెపు సత్యనారాయణమూర్తి తెలిపారు. అమ్మవారి కుంకుమ పూజలో పాల్గొనే వారు ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

రేపు గాయకుడు రఫీ సంగీత విభావరి

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 29: గోకవరం బస్టాండ్ వద్ద గల జిత్ మోహన్ మిత్ర కళావేదికలో బుధవారం సాయంత్రం 6 గంటలకు సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించనున్నారు. హిందీ గాయకుడు మహ్మద్ రఫీ వర్ధంతిని జిత్ మోహన్‌మిత్ర ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో సంగీత విభావరి జరుగుతుందని కళావేదిక నిర్వాహకులు శ్రీపాద జిత్ మోహన్ మిత్ర తెలిపారు.



పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

భవాని చారిటుబల్ ట్రస్ట్ ద్వారా సేవలు : వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 29: తన భవానీ చారిటబుల్ ట్రస్ట్ పేదల విద్య, వైద్య సేవలకు అత్యధిక ప్రాధాన్య ఇస్తుందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో సోమవారం పేద విద్యార్థులకు భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం చేశారు. తమ సంపాదనలో కొంత మొత్తాన్ని ట్రస్ట్ ద్వారా పేదలకు ఖర్చు చేస్తున్నామని ఎవరి వద్ద విరాళాలు తీసుకోవడంలేదని స్పష్టం చేశారు. ఇండియన్ బ్యాడ్మింటన్ టీమ్‌కు ఎంపికైన ఈషాకు స్పోర్ట్స్ ప్రాధాన్యతలో భాగంగా చేయూతనిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ, మొకమాటి సత్యనారాయణ, చాపల చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

లాలాచెరువు వాంబేకాలనీలో తాగునీటి పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సోమవారం శం కుస్థాపన చేశారు. వాంబేకాలనీలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.

బంగారు కొండ ప్లస్‌కు

1198 మంది బాలల గుర్తింపు

అధికారులు, కార్పొరేట్ సంస్థలు సహకరించాలి: కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూలై 29: పోషకాహారలోపం, బలహీనంగా ఉండి కుంగిపోయిన 1198 మంది బాలలను గుర్తించి బంగారు కొండ ప్లస్ ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో సోమవారం బంగారు కొండ ప్లస్ కార్యక్రమం కార్యాచరణపై చర్చించి పలు సూచనలు చేశారు. జిల్లాలో బంగారు కొండ తొలిదశలో భాగంగా 1283 మంది పిల్లల పరిరక్షణ బాధ్యత తీసుకొని ఆరు నెలలపాటు కిట్స్ అందించినట్టు చెప్పారు. పిల్లల సంరక్షణకు అధికారులతో పాటు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలన్నారు. ఈ మేరకు పేర్లను డీఆర్‌వో, ఐసీడీఎస్ అధికారికి ఇవ్వాలన్నారు. ఇదిలా ఉండగా రాజమహేంద్రవరం ఎఫ్‌సీఐ గొడౌన్‌లో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి, ఆర్డీవో చైత్రవర్షిణి తనిఖీ చేశారు.

సూర్యఘర్ యోజన పథకం పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 29: రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం రాత్రి కలెక్టర్ పి.ప్రశాంతి ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోర్టల్‌లో గృహ విద్యుత్ వినియోగదారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందించే రాయితీతో ప్రజలు తమ ఇంటిపైనే సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవచ్చన్నారు. ట్రాన్స్‌కో ఎస్‌ఈ టీవీఎస్ఎన్ మూర్తి, కొవ్వూరు సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో ఇన్‌చార్జి జేసీ నరసింహులు, ఆర్డీవో చైత్రవర్షిణి, డీపీ ఓఎస్ మాధవరావు, ఈఈ ఎస్.శామ్యూల్ పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి: యూటీఎఫ్

బిక్కవోలు, జూలై 29: వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో 117ను రద్దు చేసి ప్రీప్రైమరీతో పాటు 1నుంచి 5వరకూ ఒకే పాఠశాలగా నడపాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్‌చేశారు. సోమవారం బిక్కవోలులోని తహశీల్దార్ ఎంపీడీవో, ఎంఈవోలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేసిన విద్యారంగ సంస్కరణల ఫలితంగా విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. రాష్ట్రమంతా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం, ఉన్నత పాఠశాలల్లో రెండు మీడియంలు సమాంతరంగా కొనసాగించాలంటూ వినతిపత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ గోవిందరావు, ఎస్.సతీష్‌రెడ్డి, డీవీవీ సత్యనారాయణ, కె.దుర్గాదేవి, టి.రామచంద్రారెడ్డి, యు.అంజనీకుమార్ పాల్గొన్నారు.

బాలకృష్ణ సేవలు ప్రశంసనీయం

దివాన్ చెరువు, జూలై 29: అకడమిక్ విషయాలల్లో బాలకృష్ణ అందించిన సేవలు ప్రశంసనీయమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. నన్నయ వర్శిటీలో రాజనీతి శాస్త్ర విభాగ విశ్రాంత ఆచార్యుడు బీవీవీ బాలకృష్ణ సంతాపసభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి శ్రీనివాసరావు తదితరులు పూలమాలలతో నివాళులర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఇటీవల తూర్పుగోదావరిజిల్లా రాజకీయాలు అనే పుస్తకాన్ని ఆయన రచించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, యామినిజ్యోత్స్న, రాజశేఖర్, కె.శ్రీరమేష్, కె.దీప్తి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై శిక్షణ

రాజానగరం, జూలై 29: గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)లో కాకినాడ గ్రూప్ 18 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షిక శిక్షణా శిబిరంలో భాగంగా అగ్నిప్రమాదాల నివారణపై ఎన్‌సీసీ క్యాడెట్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. రాజమహేంద్రవరానికి చెందిన అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది జీజీయూ ప్రాంగణానికి వచ్చి అగ్నిప్రమాదాల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించవలసిన పద్ధతులపై అవగాహన కలిగించారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఎన్‌సీసీ క్యాడెట్లు శ్రమదానం చేసినట్టు క్యాంప్ కమాండర్ మేజర్ మహ్మద్ ఆసిఫ్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఏఎస్‌వో ఎ.తేజేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలల అక్రమ రవాణాను అరికడదాం

గోకవరం, జూలై 29: బాలల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెనుగొండ ఇందిరారాణి అన్నారు. గోకవరం జడ్పీ హైస్కూల్లో సోమవారం ఆడ పిల్లలను చదివిద్దాం-ఆడ పిల్లలను రక్షిద్దామనే కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలలహక్కులు, అక్రమరవాణా, బాల్యవివాహలపై అవగాహన కల్పించారు.

వరల్డ్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్

కడియం, జూలై 29: ఫొటోగ్రాఫిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రా, రాజమహేంద్రవరం ఫొటో ఆర్ట్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కడియం పల్ల వెంకన్న నర్సరీలో సోమవారం వరల్డ్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వహించారు. పల్ల సత్తిబాబు, సుబ్రహణ్యం, గణపతి, వెంకటేష్, వినయ్ ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో పోర్ట్రియేట్ టెక్నిక్స్, కాంపోజిషన్, ఎక్స్‌పెరిమెంటల్ ఫొటోగ్రఫీ, మోడల్ షూట్ తదితర అంశాలపై వర్క్‌షాపు జరిగింది. ఫొటోగ్రాఫిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర అధ్యక్షుడు ముసిని వెంకటేశ్వరరావు, సెక్రటరీ జి.రామకృష్ణంరాజు, ఏపీ ఫొటోగ్రఫీ అకాడమీ కార్యదర్శి కె.సుధాకరరెడ్డి, ఫొటో ఆర్ట్స్‌క్లబ్ కార్యదర్శి టి.వీరభద్రరావు, కడియం యూనియన్ అధ్యక్షుడు బి.మల్లికార్జునరెడ్డి హాజరయ్యారు. ప్రతిఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.

కడియం నర్సరీలను సందర్శించిన తెలంగాణా ఫారెస్టు అధికారులు



తిరుమలశెట్టి బ్రహ్మాజీ నర్సరీలో తెలంగాణా పారెస్టు అధికారులు

కడియం, జూలై 29: తెలంగాణా ఫారెస్టు బీట్ అధకారులు శిక్షణలో బాగంగా సోమవారం కడియం మండలంలో నర్సరీలను సందర్శించారు. హైదరబాదు దూలపల్లి ఫారెస్టు అకాడమీ ఆధ్వర్యంలో 6 నెలలపాటు వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. ఫీల్డ్ విజిట్‌లో భాగంగా నర్సరీలను సందర్శించినట్టు డీఎఫ్‌హో సీహెచ్ గంగారెడ్డి తెలిపారు. 12 రోజుల పాటు ఫీల్డ్ విజిట్‌లో బాగంగా ఈనెల 22న హైదరాబాద్ నుంచి ఏటూరి నాగారం, వరంగల్, భద్రాచలం ఆటవీ ప్రాంతాలను సందర్శించామని, ఏపీలో మోతుగూడెం, మారేడుమిల్లి, చింతూరు, కోరంగి మడఅడవులు, రాజమహేంద్రవరం నగర వనం వంటి వాటిని పరిశీలించి కడియం వచ్చామన్నారు. నర్సరీలో ఏఏ మొక్కలు ఉం టాయి ? వాటి ప్రత్యేకతలు, అవి ఏఏ ప్రాంతంలో అనువుగా జీవించగలవో వంటి విషయాలను విజయ దుర్గా నర్సరీగార్డెన్స్ అధినేత తిరుమల శెట్టి బ్రహ్మాజీ తెలిపారు.





వడి..వడిగా : రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి - వివరాలు 8లో



శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో మంత్రి దుర్గేష్ వెనుక కానరాని ఫొటోలు



చైర్మన్ వెనుక గత పాలకుల ఫొటోలు(ఫైల్)

ప్రభుత్వం మారింది.. మీరు మారరా!

నిడదవోలు కౌన్సిల్ హాలులో నేటికి కానరాని సీఎం, డిప్యూటీ సీఎంల ఫొటోలు

ప్రభుత్వం మారినా స్థానిక పాలకుల తీరు మాత్రం మారడంలేదు..ఇంకా గత ప్రభుత్వంలో ఉన్నట్టే ప్రవర్తిస్తున్నారు. అటు అధికారులు కిక్కురుమనలేకపోతున్నా రు. ఈ చిత్రాలే చూశారా.. ఇది నిడదవోలులోని మునిసిపల్ కౌన్సిల్ హాలు..గత ప్రభుత్వంలో చైర్మన్ వెనుక గోడకు ఎవరు ఉన్నారో చూశారా.నాటి పాల కుల చిత్రపటాలను తగిలించారు.. సహజంగా కౌన్సిల్ హాలులో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఫొటోలు మాత్రమే ఏర్పాటు చేసే ఆనవాయితీ ఉండగా గత ప్రభుత్వంలో చైర్మన్ ఫొటో కూడా పెట్టుకోవడం విమర్శలకు తావిచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వం మారింది..కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు 50 రోజులవుతుంది. కూటమి అధికారం చేపట్టిన తొలి రోజు నుంచే జిల్లావ్యాప్తంగా మునిసిపాలిటీలు.. పంచా యతీలు.. ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలోనూ సీఎం చంద్రబాబు.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలు వెలిశాయి. అయితే మంత్రి దుర్గేష్ నియోజకవర్గమైన నిడదవోలులో మాత్రం ఇంకా పాలకులు కళ్లు తెరవలేనట్టుంది..ఇలా ఫొటోలు తగిలించకుండా వదిలేశారు.. శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి మంత్రి దుర్గేష్ హాజరయ్యారు. ఆ తరువాత అయిన అధికారుల్లో కదలిక వస్తుందని కూటమి నాయకులంతా చూశారు.. సోమవారమూ ఇంతే..అధికారులు..పాలకులు ఇకనైనా మేల్కొండి.. కూటమి ప్రభుత్వంలో ఉన్నాం..గుర్తుంచుకోండి మరి..! - నిడదవోలు



చూస్తుంటే కన్నీళ్లే : మధురపూడి వద్ద కనుచూపుమేరలో ముంపు బారిన పడిన చేలు



నాట్లు..పాట్లు : నిడదవోలు మండలం తాళ్లపాలెంలో మళ్లీ నాట్లు

నిండా ముంచినది

ఈ ఏడాది అన్నదాతకు మిగిలింది కన్నీళ్లే

- పంట చేలలో వీడని ముంపు
- 14.646 హెక్టార్లలో మునక
- లబోదిబోమంటున్న రైతన్న
- తగ్గుతూ ఉన్న గోదారి వరద
- నీటిలో మునిగి ఉన్న లంకలు
- నష్టం అంచనాకు బృందాలు

రాజమహేంద్రవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి)/ కొవ్వూరు/ పెరవలి/నిడదవోలు : వరద వదిలింది.. కష్టం..నష్టం మిగిలింది..గోదావరి ఎగువ భాగంలో తగ్గుతున్నప్పటికి జిల్లా పరిధిలో లంక భూములున్ని ముంపునకు గురయ్యాయి. జిల్లాలో రాజమహేంద్రవరం, సీతానగరం, కొవ్వూరు, తాళ్ళపూడి, నిడదవోలు, కడియం,పెరవలి మండలాల్లో గోదావరి పరీవాహక ప్రాంతం విస్తరించి ఉంది.ఈ నేపథ్యంలో ఆయా మండలాల్లో ఉన్న లంకలు నీట మునిగాయి. దీంతో గత 10 రోజులుగా లంక వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట చేలు నీట మునిగాయి. ఉద్యాన పంటలు కుళ్లిపోయాయి. ఎటు చూసినా కన్నీళ్లే.. కష్టం నష్టమే మిగిలింది. దీంతో రైతులు తమ పంటలను చూసుకుని లబోదిబోమంటున్నారు.ఇంకా పలు చోట్ల చేలు తేరుకోలేదు.లంక భూములుపై ఆధారపడి అరటి, కూరగాయలు, పూల తోటలు సాగు చేస్తుంటారు. పశువులకు అవసరమైన పచ్చగడ్డి బీడులు పెంచుతుంటారు. వరద నీరు అధికంగా రావడంతో వేలాది ఎకరాల్లో వరదనీరు చేరింది. గోదావరి పూర్తిగా తగ్గినప్పటికి పల్లపు లంక భూముల్లో నీరు మాత్రం వారం రోజులు వరకు అదే విధంగా ఉంటుందని దీంతో పంటలు ఊటబారిన పడి నష్టపోతామని రైతులు వాపోతున్నారు. తీపర్రు, పుష్కరాల రేవుకు వెళ్ళే సిమ్మెంట్ రోడ్డు మీదుగా నీరు ప్రవహించింది. సాయంత్రానికి క్రమేపి తగ్గుముఖం పట్టింది. ఇక్కడే సంపద తయారికేంద్రం వైపు ఉన్న పుంత రోడ్డు కూడా నీట మునిగింది. పలు గ్రామాల్లో పశువులు పాకలు కూడా నీట మునగడంతో పశువులను సురక్షిత ప్రదేశాలకు తరలించారు. జిల్లాలో జూలైలో మొత్తం 14,646.5 హెక్టార్లలో వరి పంట, కొంత చెరకు నీటిలో మునిగిపోయాయని జిల్లా వ్యవసా యాధికారి ఎస్.మాధవరావు తెలిపారు.

నిడదవోలులో ముంపులోనే 2 వేల ఎకరాలు

నిడదవోలు మండలంలో 16,500 ఎకరాల్లో రైతాంగం వరి సాగు చేస్తుండగా ఎర్రకాలువ వరదతో సుమారు 8500 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. తాళ్లపాలెం తదితర గ్రామాల్లో సుమారు 120 ఎకరాల్లో రైతాంగం తిరిగి మరోసారి నాట్లు వేస్తున్నారు. సుమారు 3000 ఎకరాల్లో వరిచేలను దక్కించుకునేందుకు రైతాంగం ఎరువులను వినియోగిస్తున్నారు. సుమారు 2000 ఎకరాలు సాగు చేసే అవకాశం లేక నీట మునిగి ఉండడంతో అలాగే వదిలేశారు.

వరద నష్టం అంచనాకు ప్రత్యేక బృందాలు

ఈ నెలలో వరదలు,ప్రకృతి వైపరీత్యాల కారణంగా జరిగిన నష్టాన్ని గణన చేయడానికి మండల స్థాయిలో ప్రత్యేక బృందాల ద్వారా నివేదికలు తయారు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.రాజమహేంద్ర వరంలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె సోమవారం రాత్రి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎర్రకాలువ, బురద కాలువ,కొవ్వాడ కాలువ, గోదారి బండ, రహదారుల మరమ్మ తులు,ఇరిగేషన్ శాఖల ప్రతిపాదనలపై సమీక్షించారు.వరద ముంపు నివారణ చర్యలు తక్షణం చేపట్టాలన్నారు.నష్టాలు,పునరావాస కార్యక్రమాలు స్వల్ప, దీర్ఘకాలిక ప్రాతిపదికన చేపట్టి నివేదిక ఇవ్వాలన్నారు.



కానూరు అగ్రహారంలో నీట మునిగిన పామాయిల్ తోట



పెరవలి మండలం తీపర్రు వద్ద నీట మునిగిన అరటితోట



చూస్తుంటే కన్నీళ్లే : మధురపూడి వద్ద చేలు ఇలా..

12 రోజులుగా తగ్గని గోదావడి

గోదావరి నదీ తీరప్రాంతం గత 12 రోజులుగా వరద ఉధృతితో బిక్కుబిక్కుమంటుంది. ఈ నెల 19వ తేదీ నుంచి అఖండ గోదావరికి వరద పోటెత్తి ప్రమాదకరంగా ప్రవాహిస్తుంది. ఎగువన భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక, దిగువన ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దాటి అధికారుల అంచనాలకు అందకుండా ఉధృతంగా ప్రవహిస్తుంది.ఎగువన భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టినా రాజమహేంద్రవరం అఖండ గోదా వరిలో అదే ఉధృతి కనిపిస్తోంది. బ్యారేజీ నుంచి నెమ్మదిగా కిందకు వరదనీరు పోతోంది. సోమవారం రాత్రి 8 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నీటిమట్టం 14.60 అడుగులుగా ఉంది.బ్యారేజి నుంచి దిగువకు 14,19,108 క్యూసెక్కులు విడుదల చేశారు. మంగళవారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకునే అవకాశం ఉన్నట్టు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. పూర్తిగా వరద నీరు లాగి, సాధారణ పరిస్థితులు నెలకొనడానికి రెండు మూడు రోజులు పడుతుంది. భద్రాచలం వద్ద బాగా తగ్గుతోంది. సోమవారం రాత్రి 8 గంటలకు నీటిమట్టం 42.90 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉప సంహరించుకున్నారు. ఇప్పటికే సుమారు 10 అడుగులకు పైగా వరద లాగేసింది. ఎగువన భద్రాచలం నుంచి ధవళేశ్వరం బ్యారేజీకి వరద చేరుకోవడానికి సుమారు 24 గంటలు పడుతుంది. ఈ నేపథ్యంలో ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా రాజమహేంద్రవరం, కొవ్వూరులో రేవులన్నీ ముంపులోనే ఉన్నాయి.గోష్పాదక్షేత్రంలో మూడో రోజు ఆలయాలన్నీ వరద ముంపులోనే ఉన్నాయి.క్షేత్రంలోకి వచ్చే రెండు రహదారుల్లో గీతా మందిరం గేట్ల వరకు వరద నీటి ప్రవాహం చేరుకుం ది.గత వారం రోజులుగా క్షేత్రంలోని ఆలయాలన్నిటిని మూసివేశారు. వినాయకుడు, కనకదుర్గమ్మ, బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, అయ్యప్ప, మరకత గాయత్రి,లక్ష్మీ నరసింహస్వామి, షిరిడి సాయిబాబా ఆలయాల చుట్టూ వరద నీరు చేరింది. ఇసుకర్యాంపుల తవ్వకాలతో బలహీనపడిన ఏటిగట్లు ఎంతవరకు వరదను నిలువరిస్తాయోనని తీరప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నది లోపలికి ఎవ్వరు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటుచేశారు. కొవ్వూరు మండలంలోని మద్దూరులంక, పల్లిపాలెంలో నివసిస్తున్న వలస మత్స్యకారులను తరలించడానికి మద్దూరు జడ్పీ హైస్కూల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటుచేశారు. మద్దూరు లంక గ్రామంలోకి వరద నీరు ప్రవేశించకుండా ఏటిగట్టు బలహీనంగా ఉన్న ప్రాంతాన్ని ఇసుకబస్తాలతో పటిష్ట పరిచారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటుచేశారు.వరద గోదావరిని చూడడానికి పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు అదికసంఖ్యలో క్షేత్రానికి వస్తున్నారు. మహిళలు పసుపు, కుంకుమలు వేసి గోదారమ్మకు పూజలు చేస్తున్నారు.



కలెక్టరేట్ వద్ద టిడ్కో లబ్ధిదారుల నిరసన ప్రదర్శన

మా టిడ్కో ఇళ్లపైనా జగన్ అప్పు తెచ్చాడు..

- బ్యాంకుల నుంచి జప్తు నోటీసులు వస్తున్నాయి..
- బొమ్మూరు టిడ్కో లబ్ధిదారుల ఆందోళన
- కలెక్టరేట్‌లో మీ కోసం - 114 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూలై 29 : అధికారులు సమన్వయంగా ఒకరితో ఒకరు మాట్లాడుకుని సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా నలుమూలల ప్రజల నుంచి వచ్చిన 114 అర్జీలు స్వీకరించారు. ఆన్‌లైన్‌లో 108, ఆఫ్‌లైన్‌లో 6 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో రెవెన్యూ 43, పంచాయతీరాజ్ 20, హోం (పోలీస్) 12, హౌసింగ్ 6 ,ఇతర శాఖలకు 33 అర్జీలు వచ్చాయని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం తమ టిడ్కో ఇళ్ళకు బ్యాంక్ రుణంపై వడ్డీ మాఫీ చేస్తామని చెప్పి.. తమ ఇళ్ళపై లోను తెచ్చుకుని మోసం చేసిందని బొమ్మూరు టిడ్కో హౌసింగ్ పేజ్ -1 సి బ్లాక్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోయేషన్ లబ్ధిదారులు నిరసన తెలిపారు.సి బ్లాక్‌లో 672 ఇళ్లు ఉన్నాయని అందరికి బకాయి ఉందన్నారు. వడ్డీభారం సగటున ప్రతి లబ్ధిదారుడికి రూ.20 వేల నుంచి రూ. 90 వేల వరకు ఉందన్నారు. ఇప్పుడు మొండిబకాయిగా జమకట్టి మాకు జప్తునోటీసులు జారీ చేశారని..న్యాయం చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు ఈ.శ్రీనివాస్,మహిళలు కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. ఏపీ పేపరుమిల్స్ ఎంప్లాయిస్ మల్టీపర్పస్ కో-ఆపరేటివ్ సొసైటీలో సుమారు రూ.4 కోట్ల వరకు డిపాజిట్లు చేశామని..గత 9 నెలలుగా తమకు డిపాజిట్లపై రావాల్సిన వడ్డీని మిల్లు యాజమాన్యం నిలిపివేసిందని ఏపీ పేపర్ మిల్స్ మాజీ ఉద్యోగులు ఆందోళణ వ్యక్తం చేశారు.కలెక్టరేట్‌కు తమ గోడును వివరించారు. పిల్లల చదువులు, ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం డబ్బులు డిపాజిట్ చేశామని కానీ గత 9నెలలుగా పరిస్థితి చూస్తే మా డబ్బు భద్రతపై అనుమానం కలుగుతుందన్నారు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలన్నారు. గత కలెక్టర్ ను మూడుసార్లు కలిసి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. జిల్లా సహకార శాఖ అధికారికి పంపి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 35 అర్జీలు

రాజమహేంద్రవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టం(మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ డి.నరసింహ కిషోర్ స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో బాధితుల సమక్షంలోనే ఫోన్‌లో మాట్లాడి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 35 అర్జీలు ఎస్పీ స్వీకరించారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్ఆర్.రాజశేఖర్ రాజు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సూరి అప్పారావు, ఎస్ఐ అలీ ఖాన్ పాల్గొన్నారు.



మా డబ్బులేమయ్యాయో : పేపరుమిల్లు రిటైర్డ్ కార్మికుల నిరసన

బియ్యమూ... వదల్లే!



గత ఐదేళ్లూ బియ్యం ధరలు దంచుడే

గత టీడీపీ ప్రభుత్వంలో 25 కిలోల పీఎల్ బియ్యం బస్తా రూ.800.. లలిత బ్రాండ్ అయితే రూ.850.. వైసీపీ అధికారంలోకి వచ్చింది.. ధరల్లో అమాంతం తేడా వచ్చింది.. బస్తా కు ఒక కిలో చొప్పున పెంచి సుమారు రూ.500 వరకూ పెంచేశారు.. ఇదేమిటని అడిగితే ధరలు పెరిగాయని చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పీఎల్ బస్తా ధర రూ.1200 నుంచి రూ.1300 ఉందంటే పరిస్థితి ఎలా మారిందో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వంలో బియ్యం ధరలపై నియంత్రణ లేకపోవడంతో ఇష్టానుసారం పెంచేశారు..కూటమి ప్రభుత్వం దృష్టి సారించి బియ్యం ధరలను తగ్గించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

- అమాంతం పెరిగిన ధరలు
- ఒక్కో బస్తాకు రూ.400 పెంపు
- బస్తాకు 26 కిలోలు చేసి నొక్కుడు
- ధరలపై నియంత్రణ కరువు
- మిల్లర్లు.. వ్యాపారుల మాయాజాలం
- నాసిరకం బియ్యం కిలో రూ.40
- రంగు సంచుల్లో రేషన్ బియ్యం
- మోసపోతున్న వినియోగదారుడు
- కూటమి వచ్చినా తగ్గని వైనం
- కళ్లు మూసుకున్న విజిలెన్స్
- ధాన్యాగారంలో ఇదీ దుస్థితి

బియ్యం ధరలు చూస్తుంటే అన్నం కుండ వణుకుతోంది. ధరలపై నియంత్రణ లేకపోవడంతో అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతున్నాయి. దీంతో సామాన్యుడికి ముద్ద దిగడం లేదు.రూ.40 పెట్టినా కేజీ బియ్యం రాని పరిస్థితి ఉంది.సన్నబియ్యం రైతు బజార్‌లోనే రూ.49కి విక్రయిస్తుంటే ఇక బయట వ్యాపారులను ఏమంటాం .పరిస్థితి ఇలాగే కొనసాగితే బియ్యం గింజల లెక్కన వండుకోవాల్సిందేనేమో..ఎందుకంటే గత ఐదేళ్లలో బియ్యం ధరలు అంతలా పెరిగిపోయాయి. ప్రస్తుతం కూ టమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బియ్యం ధరలపై నియంత్రణ విధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

100 కిలోల ధాన్యం బస్తా రూ.2300

ధాన్యం ధర గిట్టుబాటుకాక రైతు దైన్యంగా ఉంటే.. బియ్యం ధరలు మాత్రం బెంబేలెత్తిస్తున్నాయి. ప్రభుత్వ లెక్క ప్రకారం 100 కేజీల ధాన్యం బస్తా రైతు వద్ద రూ.2300.ఒక ధాన్యం బస్తా ఆడిస్తే దాదాపుగా 65 కేజీల బియ్యం వస్తాయి.ఉభయగోదావరి జిల్లాలకు ధాన్యాగారమని పేరు.గోదావరి జిల్లాల్లోనే పెరుగుతున్న బియ్యం ధరలు చూసి బెంబేలెత్తిపోతున్నారు.అంచనాలకు మించి ధాన్యం దిగుబడి ఉంటున్నా ధరలు మాత్రం తగ్గుముఖం పట్టడంలేదు.గత ఐదేళ్ల వైసీపీ హయాంలో బియ్యం ధరలు పూర్తిగా అదుపు తప్పాయి. మిల్లర్లు, వ్యాపారులు కలిసి ధరలు ఇష్టానుసారం పెంచేస్తున్నారు. వినియోగదారుడికి బియ్యం చేరేసరికి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

మిల్లర్ల మాయాజాలం

రైస్ మిల్లర్లు సిండికేట్లుగా మారిపోయి ధరలు నిర్ణయిస్తున్నారు. ఒకనాడు మూతబడిన రైస్ మిల్లింగ్ పరిశ్రమ నేడు మళ్లీ పుంజుకోవడానికి అదే కారణం. ఇష్టానుసారం లైసెన్స్‌లు ఇచ్చేయడంతో కొత్తకొత్త బ్రాండ్లు మార్కెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. రేషన్ బియ్యం గ్రైండింగ్ చేసి రంగు రంగుల సంచుల్లో ప్యాకింగ్ చేసి విక్రయించేస్తున్నారు. రైస్ మిల్లులే మాయాజాలానికి అడ్డాలుగా మారిపోయి.. నేడు రైస్ మిల్లింగ్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా మారిపోయింది. బియ్యం కొట్లోకి వెళ్లి చూస్తే ఎన్నో బ్రాండ్లు.వాటిలో సూపర్‌ఫైన్, ఎక్స్‌పోర్ట్, సూపర్ ప్రీమియం,ప్రీమియం ఎక్స్‌పోర్ట్ అంటూ విభజిస్తూ రేట్లు బాదేస్తారు. ఉదాహరణకు సార్టెక్ అనేది ఓ జపాన్ కంపెనీ యంత్రం పేరు. కానీ బియ్యం బస్తాలపై సార్టెక్, సార్టెక్స్ అని అక్షరాలు మార్చి ముద్రిస్తూ అదేదో ఇంకో రకం బియ్యం మాదిరిగా ధరలు పిండుతున్నారు. విజిలెన్స్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడంతో రేషన్ బియాన్ని పాలిష్ చేసి బియ్యం దుకాణాల ద్వారా బ్రాండెడ్ బియ్యంగా విక్రయిస్తున్నారు. నాణ్యమైన సరుకులో నాసిరకం బియ్యం కలగలిపేసి విక్రయించేస్తారు. 26 కేజీల బియ్యం బస్తాలో నాలుగు కేజీల ఇతర రకాలు కలిపేసినా రూ.100ల పైనే లాభం వస్తుంది. దీంతో ప్రస్తుతం బియ్యం దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.జిల్లాలో కనీసం 2 వేల షాపులపైనే ఉంటాయని సమాచారం.నాలుగేళ్ల కిందట పౌర సరఫరాల శాఖ నియంత్రణను ప్రభుత్వం తొలగించడంతో దుకాణాల సంఖ్యకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఇక నాణ్యత లోపాలను పరీక్షించి చర్యలు తీసుకోవాల్సిన శాఖలూ పట్టనట్టు ఉంటున్నాయి. దీంతో ధరల్లో వ్యాపారులు, మిల్లర్ల ఇష్టారాజ్యమైపోయింది.

ఇంతలో.. అంత తేడానా?

గత టీడీపీ ప్రభుత్వంలో 25 కేజీల పీఎల్ బియ్యం బస్తా 800.. లలిత అయితే రూ.850.. కర్నూలు సోనా 26 కిలోల బస్తా రూ.1200 ఉండగా ఇప్పుడు కర్నూలు సోనా రూ.1800- 2000కి చేరింది. బియ్యంలో మరో మాయాజాలం పాతవి. ఏడాది పాతవి, రెండేళ్ల పాతవి, ఫైన్, సూపర్ ఫైన్ అంటూ విడదీసి రేట్లు నిర్ణయిస్తున్నారు. అదే రకం బియ్యం ఏడాది పాతవైతే రూ.200, రెండేళ్ల పాతవైతే మరో రెండొందల ఎగస్త్రాకు అమ్మేస్తున్నారు. రెండేళ్ల పాతవి బీపీటీ రకం క్వింటా రూ.6000 -7000 వరకూ విక్రయిస్తున్నారు. సాంబ రకం వంద కిలోలు రూ.5000పైన, పీఎల్ రూ.4500పైన ,దం పుడు బియ్యం రూ.6000లకు అమ్ముతున్నారు. నాసిరకం బియ్యం కావాలన్నా రూ.40వెచ్చించాల్సిన రోజులు దాపురించాయి. ఆఖరికి సంచుల బట్టి కూడా ధరలు పెట్టారు. గుడ్డసంచి,ప్లాస్టిక్ సంచి..సోనామసూరిలో బ్లూ, గ్రీన్ రకాలంటూ ధరలు పెంచడానికే అన్నట్టు విభజన చేస్తున్నారు. బాస్మతి మినహా మిగతా అన్ని రకాల బియ్యం విదేశీ ఎగుమతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు తగు చర్యలకు దిగితే బియ్యం ధరలు అదుపులోకి వచ్చే అవకాశం ఉంది. బెనిన్, చైనాతో సహా సుమారు 100 దేశాలకు భారత్ బియ్యాన్ని ఎగుమతి చేస్తోంది. ప్రపంచ బియ్యం వ్యాపారంలో భారత్ వాటా 40శాతం పైనే ఉంది.ఎగుమతులు పెరిగిపోవడంతో పంట పండించే మనకూ ధరలూ పెరుగుతున్నాయి.

నేటికీ తెల్లకాగితంపైనే బిల్లు

బియ్య దుకాణాల వైపు కన్నెత్తి చూడడానికి వాణిజ్య పన్నుల శాఖకు ఖాళీ లేకుండా పోయింది. ఆ శాఖ ఉందని విజిలెన్సు వారూ పట్టించుకోవడం మానేశారు. ప్రజలకు రోజూ అత్యంత అవసరమైనది బియ్యం. అన్నం లేకుండా పూట గడవదు. అంతటి ప్రాధాన్యం ఉన్న నిత్యావసరంపై యంత్రాంగానికి పెద్దగా పట్టింపు కనబడడం లేదు. బియ్యం దుకాణాల్లో.. పెద్ద దుకాణాల్లో సైతం ధరల పట్టికలు ఎక్కడా కనిపించవు. ఏ రకం బియ్యం ఉన్నాయో కూడా తెలియదు. ఈసారి తీసుకెళ్లిన బియ్యం మళ్లీ సారికి దొరకవు. వ్యాపారులు చెప్పిన దానికి వినియోగదారుడు తలాడించి దేవుడిపై భారం వేసి కొనుక్కోవాల్సిందే. ఏ రకం బియ్యం ఎంతకు అమ్మాలనే దానిపై ప్రభుత్వ నియంత్రణ,ధరల నిర్ణయం లేదు. బిల్లులు ఇవ్వకపోయినా అధికారులకు కనబడదు. బిల్లు అడిగితే ఓ చీటీపై రాసి స్తారు. దానిపై ఏరకం, ఏబ్రాండు అనేది ఉండనే ఉండవు. ఎక్కడా శాంపిల్స్ కనిపించవు. ఉదాహరణకు సీతంపేట ప్రాంతంలోని ఓ పెద్ద బియ్యం కొట్టులో చాలా ఏళ్ల నుంచీ ఇలాంటి చీటీల వ్యాపారం జరుగుతోంది. రోజూ లక్షల రూపాయల్లో విక్రయాలు జరిగే ఇలాంటి పెద్ద షాపుల్లోనే పరిస్థితి ఏళ్ల తరబడి ఇలా ఉంటే ఇప్పటి వరకూ జనం జేబులకు పడిన చిల్లులు, ప్రభుత్వ గల్లాపెట్టెకు పడిన కన్నం లెక్కలు వేస్తే కళ్లు బైర్లుకమ్మక తప్పదు. బియ్యం విక్రయాలపై యంత్రాంగం ఉదాసీనంగా ఉండడంతో విని యోగదారుడికి బియ్యం చుక్కలు చూపిస్తున్నాయి.



స్నేక్ స్నాచర్ పట్టుకున్న తాచుపాము

తాచుపాము పగ

గోకవరం, జూలై 29 : పాము పగపడితే వదలదు.. తరుముకుంటూ ఇంటి వరకూ వచ్చేస్తుంది. ఈ మాట తరచూ వింటుంటాం. ఈ సంఘటన వింతే ఆ మాట నిజం అని నమ్మకతప్పదు మరి.. గోకవరం మండలం అచ్చుతాపురం గ్రామానికి చెందిన దడాల కన్నయ్య పుట్టగొడుగుల కోసం సోమవారం ఉదయం పొలానికి వెళ్ళాడు. పుట్ట గొడుగులను అన్వేషించే క్రమంలో తాచుపాము కన్నయ్యకు తారసపడి బుసలుకొట్టింది. భయంతో కన్నయ్య ఇంటికి పరిగెత్తుకుంటూ వచ్చే శాడు.కాసేపటికి ఆ పాము కన్నయ్య ఇంటి పై కప్పు (చూరు)లో దాగి బుసలు కొడుతూ కనిపించింది. దీంతో భయాందోళనకు గురైన కన్నయ్య, అతని కుటుంబీకులు ఇంటి నుంచి బయటకు వచ్చేశారు. వెంటనే స్నేక్ స్నేచర్‌కు సమాచారం అందించారు. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన స్నేక్ స్నేచర్ ఇంటి పై కప్పులో దాగి ఉన్న పామును ఎంతో చాకచక్యంగా పట్టుకోవడంతో కన్నయ్యఅతని కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టుబడిన పాము గోధుమత్రాచు అని స్థానికులు గుర్తించారు.ఆ తరువాత పామును అడవిలో విడిచిపెట్టేసినట్టు స్థానికులు తెలిపారు.

జేసీ తేజ్ భరత్ రిలీవ్

ఇన్‌చార్జిగా డీఆర్వో నరసింహులు

రాజమహేంద్రవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల బదిలీ అయిన జేసీ ఎన్.తేజ్‌భరత్ సోమవారం బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. తన బాధ్య తలను డీఆర్వో జి.నరసింహులకు అప్పగించారు. కొత్త జేసీ విధుల్లో చేరే వరకూ నరసింహులే ఇన్‌చార్జి జేసీగా వ్యవహరిస్తారు. జిల్లా జేసీగా హిమాన్స్ కౌశిక్‌ను నియమించినా ఇంత వరకూ విధుల్లో చేరలేదు. జేసీగా కాకుండా వేరే పోస్టుకు ప్రయత్నిస్తున్నారని కొందరు, త్వరలో విధుల్లో చేరతారని మరికొందరు చెబుతున్నారు. తేజ్‌భరత్‌ను కడప మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించినా ఇష్టంలేదు. ఆయన కూడా వేరే పోస్టుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఇక్కడ రిలీవ్ అయినా కడపలో జాయిన్‌కాలేదు.

1న పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం, జూలై29(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లు ఆగస్టు 1 ఉదయం 5 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటివద్దకు వెళ్లి సచివాలయ ,ఇతర ఉద్యోగులు పంపిణీ చేయాలని కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. జిల్లాలోని ఎంపీడీవోలతో సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 2,40,595 మందికి రూ.102,54,77,500 పంపిణీ చేయనున్నట్టు చెప్పారు.మొదటి రోజే 99 శాతం పంపిణీ చేయాలని, సాంకేతిక సమస్య తలెత్తితే మరుసటిరోజు ఇవ్వాలని స్పష్టం చేశారు. జిల్లాలో 3,900 మంది సచివాలయ ఉద్యోగులు, 300 మంది ఇతర ప్రభుత్వ ఉద్యోగులు కలిపి మొత్తం 4200 మంది ఉద్యోగులు పంపిణీ చేస్తారన్నారు. ఒక్కో ఉద్యోగి 50 నుంచి 90 మంది పింఛనుదార్లతో మ్యాపింగ్ చేసినట్టు చెప్పారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

వేతన బకాయిలు చెల్లించాలి



విక్రయశాలను వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కొవ్వూరు, జూలై 29: ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 13 నెలల బకాయి వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు నిర్వహిస్తున్న కూరగాయల విక్రయాలను సీఐటీయూ నాయకులు సందర్శించారు. సుందరబాబు మాట్లాడుతూ పురుగులు మందులు వాడకుండా రైతులను చైతన్య పరిచి సేంద్రియ వ్యవసాయ పంటల ఉత్పత్తిని ప్రోత్సహిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 13 నెలలుగా వైసీపీ ప్రభుత్వం వేతనాలు అందించడకపోవడం దుర్మార్గమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యవసాయ సిబ్బంది జిల్లాలో 300 మంది ఉన్నారు. వారందరికీ కూటమి ప్రభుత్వం బకాయి వేతనాలు తక్షణం విడుదల చేసి కుటుంబాలను ఆదుకోవాలన్నారు.

విద్యార్థులకు ఫుట్‌మ్యాట్‌ల అందజేత

కొవ్వూరు, జూలై 29: మండలంలోని ధర్మవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సంత్ నిరంకారి మిషన్ (ఢిల్లీ) సంస్థ ఫుట్‌మ్యాట్‌లు పంపిణీ చేసింది. సోమవారం పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కొయ్యల ప్రసాద్ ఆధ్వర్యంలో సంస్థ రాజమహేంద్రవరం శాఖ ప్రతినిధులు కె.భాగ్యలక్ష్మి, డి.కళ్యాణిలు 3నుంచి 10 తరగతి విద్యార్థులకు ఫుట్‌మ్యాట్‌లను అందజేశారు. ఉప సర్పంచ్ వెంపాటి యుగంధర్, గారపాటి వెంకటకృష్ణ, నేరేడుమిల్లి నాగేశ్వరరరావు, చిడిపి దుర్గాభవాని, ఎ.గన్ని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు, ఆయాకు మెమో జారీ

తాళ్లపూడి, జూలై 29: అన్నదేవరపేటలోని అంగన్‌వాడీ టీచర్‌కు, ఆయాకు మెమో జారీ చేసినట్టు సీడీపీవో మమ్మీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న 'అంగన్‌వాడీ గుడ్డు వెరీ బ్యాడ్' శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండడం, అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన గుడ్లు వచ్చాయన్న విషయం సూపర్‌వైజర్‌కు తెలియజేయకపోవడంతో టీచర్, ఆయాకు మెమో జారీ చేసినట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అన్నదేవరపేటలో జరిగిన విషయంలో ఫిర్యాదు వచ్చిన తర్వాత రోజు 600 గుడ్లు పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రంలో అందించామని కాంట్రాక్టరు సతీష్ చరవాణిలో తెలిపారు.

బాలికలను రక్షిద్దాం..చదివిద్దాం..



బాలికలకు అవగాహన కలిగిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

నిడదవోలు, జూలై 29: బాలికలు విద్య ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని సీడీపీవో లక్ష్మి అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమానికి ఆమె విచ్చేసి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాలికల రక్షణకు, విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నళిని, టీచర్ విక్టోరియా, సోషల్ వర్కర్ శిరీష, హెచ్‌ఎం జిలానీ తదితర్లు పాల్గొన్నారు.

పింఛన్లు 99 శాతం పంపిణీ చేయాలి

గోపాలపురం, జూలై 29: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ 99శాతం చేయాల్సిందేనని ఎంపీడీవో కే.రమేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సోమవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీపై సంసిద్ధత సమావేశంలో ఆయన మాట్లాడుతూ పింఛన్ల పంపిణీకి 141మంది సిబ్బందిని సిద్ధపరిచామన్నారు. రెండు గ్రామాలకు ఒకరు చొప్పున ఆరుగురు మండల స్థాయి అధికారులను పర్యవేక్షకులుగా నియమించామన్నారు. మండలంలో మొత్తం 9197మంది లబ్ధిదారులకు రూ.3,88,61,000 పంపిణీ చేయాల్సి ఉందన్నారు. 1వ తేదీ ఉదయం 5గంటలకే పింఛన్ పంపిణీ కార్యక్రమానికి సిబ్బంది హాజరుకావాలని ఎంపీడీవో చెప్పారు.

చాగల్లు హైస్కూల్‌లో ప్లాంటేషన్



చాగల్లు హైస్కూల్లో మొక్కలు నాటుతున్న లయన్స్, మానవత సభ్యులు

చాగల్లు, జూలై 29: లయన్స్‌క్లబ్, మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్లో మొక్కలు నాటారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు, మానవత సభ్యుడు ఏవీవీ సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ప్రతిపౌరుడు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో కోడి శ్రీనివాసరావు, కేతా సాహెబ్, ఆళ్ల జానకిరామారావు, ఆలపాటి లక్ష్మణరావు, బొడ్డు రాజు, జేవీకే ప్రసాద్, పచ్చిపులుసు ప్రసాద్, కేవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామాజిక భాగస్వామ్య దినోత్సవం



రాజంపాలెం హైస్కూల్లో చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న నాయకులు

గోపాలపురం, జూలై 29: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక భాగస్వామ్య దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ ంసదర్భంగా విద్యార్థులకు పలువురు నాయకుల ఆర్థిక సాయంతో సమకూర్చిన ఆహార పదార్థాలను అందజేశారు.

జీవో 11ను రద్దు చేయాలి

నల్లజర్ల, జూలై 29: జీవో 11ను రద్దు చేసి, జీవో 53 ప్రకారం టీచర్లను కేటాయించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్ష ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ మనోహర్‌కుమార్, మండలాధ్యక్షుడు బండి కిషోర్, పీవీ అప్పారావు పాల్గొన్నారు.

తహశీల్దార్ సుధకు సత్కారం



తహశీల్దార్ సుధను సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

పెరవలి, జూలై 29: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బదిలీపై వచ్చిన తహశీల్దార్ డి.సుధ ఏలూరు జిల్లాకు వెళుతున్న సందర్భంగా ఆమెకు వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీటీ కనకదుర్గ, సన్నిబాబు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- కొవ్వూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ
- డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 29: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులో ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో సోమవారం ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి విద్యార్థులకు భోజనం వడ్డించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద వారికి విద్య దూరం కాకుడదని, రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలతో పాటు, కళాశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తోందని, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోందన్నారు. దేశంలో చాలామంది ఐఏఎస్, ఐపీఎస్‌లు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు, మంత్రులు, ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు ప్రభుత్వ కళాశాలల్లోనే చదువుకున్నారన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, టీడీపీ పట్టణాధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, నామాన పరమేశ్వరరావు, అర్జిల్లి రామకృష్ణ, పెనుమాక జయరాజు, బొండాడ సత్యనారాయణ, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు కొవ్వూరు రెండో వార్డులోని ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని జనసైనికులు ప్రారంభించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు డేగల రామ్‌కుమార్ విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో పోలిశెట్టి శివ, డేగల నిఖిత, చిలపతి నాగేశ్వరరావు, తిరుమల గణపతి, మహ్మద్ బహద్దూర్ పాల్గొన్నారు. మండలంలోని వేములూరు, పంగిడి, వాడపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కూటమి నాయకులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు.



పెరవలి: మల్లేశ్వరంలో విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డిస్తున్న నాయకులు

పెరవలి: మండలంలోని మల్లేశ్వరంలో జరిగిన కార్యక్రమానికి ఎంఈవో బొబ్బిలి స్వరూప్ విచ్చేసి మాట్లాడారు. కోనసీమ జిల్లా లంకలగన్నవరంలో 1841లో జన్మించిన డొక్కా సీతమ్మ ఉన్నంతలో పేద, సాధువులకు అన్నం పెట్టేవారని చెప్పారు. అన్నదానంలో ప్రసిద్ధికెక్కిన ఆమె చరిత్రను అందరూ తెలుసుకుని తమ అడుగు జాడల్లో నడవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. మాజీ ఎంపీపీ కోటిపల్లి మురళీకృష్ణ, ఎంపీటీసీ కోటిపల్లి దేవికారాణి పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ నాగలక్ష్మి, మేడిచర్ల భాస్కర్, మారుతి, సాయి, రామారావు, సాంబమూర్తి పాల్గొన్నారు. అలాగే నెంబర్-2 పాఠశాలలో అన్నవరప్పాడు కూటమి నాయకుల ఆధ్వర్యంలో పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీఎస్ నాగేశ్వరరావు, పెద నాగేశ్వరరావు, ఎంపీటీసీ అనంతలక్ష్మి, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- శిక్షా సప్తాహ్ ముగింపు కార్యక్రమంలో ఎంఈవో తిరుమలదాసు

దేవరపల్లి, జూలై 29: ప్రభుత్వ సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంఈవో తిరుమలదాసు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం ప్రాథమికోన్నత పాఠశాల, యర్నగూడెం, యాదవోలు జడ్పీ హైస్కూళ్లలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం ముగింపు సందర్భంగా లక్ష్మీపురం హెచ్‌ఎం పి.అబ్బులు, యర్నగూడెం హెచ్‌ఎం ఊబా చంద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో ఎంఈవో మాట్లాడుతూ వారం రోజులుగా మండలంలోని స్కూళ్లలో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం, బ్యాగ్‌లు అందజేశారు. టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, నాయకులు నున్నా చిన్ని, మెంటిమి సురేష్, మెంటిమి అమరావతి, కిట్టూ, బొల్లిన శ్రీధర్, పెనుమత్స సుబ్బరాజు, బొల్లిన భాస్కర్, యాదవోలు సర్పంచ్ వరప్రసాద్, శ్రీనివాసు పాల్గొన్నారు.



దేవరపల్లి: లక్ష్మీపురంలో విద్యార్థులకు దుస్తులు, బ్యాగ్‌లు అందజేస్తున్న దృశ్యం

చాగల్లు: స్థానిక జూనియర్ బేసిక్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దాతలు పట్టపు సుబ్రహ్మణ్యం, సత్యవతి దంపతుల సహకారంతో దాతృత్వంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ విద్యార్థులకు, విద్యాకమిటీ సభ్యులకు శుభదిన్ తిథి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్‌పీసీ చైర్మన్ ఇంటి శేఖర్, గంగ్రోతు సూర్యనారాయణ, ఇంటి వీర్రాజు, పోలిశెట్టి శ్రీనివాసరావు, మిరియాల సతీష్, హెచ్‌ఎం పిల్లి శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రానికి పరిశ్రమలు రాకూడదనే ఢిల్లీలో ధర్నా

- వైఎస్ జగన్‌పై పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ విమర్శ



మాజీ ఎమ్మెల్యే వర్మను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, సువర్ణరాజు

దేవరపల్లి, జూలై 29: రాష్ట్రాన్ని జగన్ సర్వనాశం చేశాడని, రాష్ట్రంలో పరిశ్రమలు రాకూడదనే దుర్మార్గపు ఉద్దేశంతో ఢిల్లీలో ధర్నా చేస్తున్నాడని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పిఠాపురం ఎమ్మెల్యే సీటును త్యాగం చేయడంతోపాటు అక్కడ పవన్‌కల్యాణ్ విజయానికి కృషి చేసినందుకు వర్మను దేవరపల్లిలో సోమవారం ఘనంగా సత్కరించారు. ముందుగా వర్మకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు దేవరపల్లి నుంచి త్యాజంపూడి వరకు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. అనంతరం గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వర్మ మాట్లాడుతూ జగన్ అమ్మఒడి పథకం కుటుంబంలో ఒకరికి మాత్రమే వేశారని, పరిపాలన దక్షత గల చంద్రబాబు కుటుంబంలో చదువుకునే అందరికీ రూ.15 వేలు ఇస్తానన్నారని చెప్పారు. నాశిరకం మద్యం వల్ల వైసీపీ పాలనలో ఎంతో మంది అనారోగ్యంతో మృత్యువాత కూడా పడ్డారన్నారు. కూటమి కలయికకు పవన్‌కల్యాణ్ ఎంతో కృషి చేశారన్నారు. ఆ కూటమి రాష్ట్రానికి వెన్నెముకగా నిలిచిందన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ జగన్ సిద్ధం సిద్ధమంటూ ప్రచారం చేసినా ఆ పార్టీని ప్రజలు సమాధి చేశారన్నారు. త్యాగాల నుంచి వచ్చే విజయమే శాశ్వతంగా ఉంటుందని, పిఠాపురం స్థానాన్ని పవన్‌కల్యాణ్‌కి ఇవ్వడం, ఆయన గెలుపు కోసం నిరంతరం కృషి చేసిన వర్మను అభినందించారు. అధ్వానంగా ఉన్న త్యాజంపూడి-యర్నగూడెం రోడ్డులో గుంతలు పూడ్చే పని రేపటి నుంచే ప్రారంభిస్తానన్నారు. సువర్ణరాజు మాట్లాడుతూ వాగ్దానాలు ఇవ్వడం, నిలబెట్టుకోవడం వర్మకే చెల్లిందన్నారు. రాష్ట్రంలో మంత్రులందర్ని పిఠాపురంలో తిష్టవేయించి పవన్‌కల్యాణ్‌ను ఓడించాలని ఎన్నో కుట్రలు పన్నారని, అయితే వర్మ వల్ల ఘన పవన్ విజయం సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఆంద్రూ అనీల్, ముమ్మిడి సత్యనారాయణ, కొయ్యలమూడి చినబాబు, యంద్రపాటి రాజు, డాక్టర్ కృష్ణారావు, కాట్నం గణేష్, అనిశెట్టి మధు, కోలా రామకృష్ణ, కాళ్ళ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఆత్మహత్య డ్రామా

అయినపర్తి రామతులసీ దంపతులు

నల్లజర్ల, జూలై 29: అంగన్‌వాడీ ఆయా తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఆత్మహత్య డ్రామా ఆడి కూటమి నాయకులను, తన కుటుంబాన్ని భయపెట్టే ప్రయత్నం చేసిందని అచ్చన్నపాలెం గ్రామానికి చెందిన అయినపర్తి రామతులసీ, హరిప్రసాద్ దంపతులు పేర్కొన్నారు. సోమవారం మాజీ సర్పంచ్ పాతూరి ఆదినారాయణ నివాసం వద్ద జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలోని అంగన్‌వాడీ నెంబరు 31లో ఉన్న ఆయా ఉన్నమట్ల కళ్యాణి ఈ నెల 25న తమ కుమార్తె పద్మజభవానీని చెంపపై, తొడపై కొట్టడంతో గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేశామని, వారు పిలిచినా వెళ్లక పోగా మీకు చేతనైన పని చేసుకోవాలని చెప్పడంతో తాము ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. వారు శనివారం మెమో ఇవ్వగా ఆదివారం మనస్తాపంతో పురుగుల మందు తాగినట్టు డ్రామా సృష్టించిందన్నారు. కూటమి నాయకులు పాతూరి రమేష్, జాలపర్తి నారాయణ, కాకర్ల రాంబాబులపై పోలీసు కేసులు పెట్టిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉన్నమట్ల ఇసాకు, పాతూరి ఆదినారాయణ, కూచిపూడి సత్యనారాయణ, వట్టికూటి సీతారామకృష్ణ, పాతూరి రత్నాజీ, కోడూరి రవి పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

నల్లజర్ల, జూలై 29: మండలంలోని దూబచర్ల గ్రామానికి చెందిన విద్యార్థి మండపాటి రవి నాగ దుర్గారావు పదో తరగతిలో ద్వితీయ స్థానం సాధించాడు. ఇటీవల రవి తండ్రి వీరబాబు లారీ ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోవడంతో కళాశాల ఫీజు కట్టేందుకు ఇబ్బందుల పడుతున్నాడు. దీంతో విషయాన్ని దూబచర్ల హైస్కూల్ ఉపాధ్యాయుడు బొందల శ్రీనివాస్ సహోపాధ్యాయులకు తెలియజేసి అందరూ కలిసి రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు.

ఉత్తమ విద్యా విధానంతో మంచి పౌరులు



ఎమ్మెల్యే మద్దిపాటిని సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

నల్లజర్ల, జూలై 29: ఉత్తమ విద్యా విధానం మంచి పౌరులను తయారు చేస్తుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. సోమవారం వేణుగోపాలస్వామి కల్యాణ మండపంలో విశ్రాంత ఉద్యోగుల మండల సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు ఐవీ సత్యం అధ్వర్యంలో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ తాను ప్రకాశరావుపాలెం ప్రాథమిక పాఠశాలలో చదివినప్పుడు గురువులు సిద్దాబత్తుల బాలయ్య, వి.కామేశ్వరావు, పెర్నాడి రాజు, చెక్కా సూర్యప్రభాదేవి బాగా విద్య నేర్పడం వల్లే నేడు ఈ స్థాయిలో ఉన్నానన్నారు. అనంతరం ఆయనను విశ్రాంత ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం, గొడుగులు వితరణ

ఉండ్రాజవరం, జూలై 29: మోర్త నెం.2 పాఠశాల విద్యార్థులకు శిక్షా సప్తాహ్ 7వ రోజు కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ మొబలైజేషన్ డే సందర్భంగా సోమవారం మధ్యాహ్న భోజనానికి అదనంగా దాతల సహకారంతో విద్యార్థులకు స్వీట్స్, పెరుగు, బంగాళాదుంప కూర, అరటి పళ్లు అందించినట్టు హెచ్‌ఎం ఎస్ఎల్‌వీ ప్రసాదరావు తెలిపారు. దాత చప్పిడి హనుమంతరావు సహకారంతో అందించామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు. తాడిపర్రు నెం.2 పాఠశాలలో విద్యార్థులకు పాలంగి నెం.2 పాఠశాల హెచ్‌ఎం కె.పరమపావని గొడుగులు అందజేశారు. ఈమెను హెచ్‌ఎం కాశీవిశ్వనాథం, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

సర్పంచ్‌ల సమస్యలపై పీఆర్ డైరెక్టర్‌కు వినతి

ఉండ్రాజవరం, జూలై 29: సర్పంచ్‌ల సమస్యలపై సోమవారం విజయవాడలో పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణతేజ్‌ను కలిసినట్టు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి, తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు తెలిపారు. ఈ మేరకు పంచాయతీల్లో ఉన్న సమస్యలను సర్పంచ్‌ల సంఘం నాయకులు డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రం అందజేసినట్టు నరేంద్రబాబు తెలిపారు.

శాకంబరిగా కన్యకాపరమేశ్వరి

ఉండ్రాజవరం, జూలై 29: ఉండ్రాజవరంలో ఆషాఢమాసం సందర్భంగా సోమవారం స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరిని కూరగాయలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

తెగిపడిన విద్యుత్ వైరు తగిలి..ఒకరి మృతి

కొవ్వూరు, జూలై 29: తెగిపడిన విద్యుత్ వైరు తగిలి వ్యక్తి మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపారు. నిడదవోలు మండలం పురుషోత్తపల్లికి చెందిన దాసరి శ్రీనివాసు(41) సోమవారం కొవ్వూరు మండలం మద్దూరులంక పొలాల్లో పనిచేయడానికి వచ్చాడు. పొలంలో తెగి పడి ఉన్న కరెంటు వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా శ్రీనివాసు దంపతులు 15 ఏళ్ల క్రితం విడిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

బాలల అక్రమ రవాణా అరికడదాం

గోకవరం, జూలై 29: బాలల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతిఒక్కరు సహకరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెనుగొండ ఇందిరారాణి అన్నారు. గోకవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆడపిల్లలను చదివిద్దాం- ఆడ పిల్లలను రక్షిద్దామనే కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరారాణి మాట్లాడుతూ బాలల హక్కులు, అక్రమ రవాణా, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈనెల 18నుంచి ఆగస్టు 30వరకు 8,9,10వ తరగతి విద్యార్థులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు.

బాలకృష్ణ సేవలు ప్రశంసనీయం

దివాన్ చెరువు, జూలై 29: అకడమిక్ విషయాలల్లో బాలకృష్ణ అందించిన సేవలు ప్రశంసనీయమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. నన్నయ వర్శిటీలో రాజనీతిశాస్త్ర విభాగ విశ్రాంత ఆచార్యుడు బీవీవీ బాలకృష్ణ సంతాపసభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి శ్రీనివాసరావు తదితరులు పూలమాలలతో నివాళులర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఇటీవల తూర్పుగోదావరిజిల్లా రాజకీయాలు అనే పుస్తకాన్ని ఆయన రచించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తగ్గుతున్న వరద ఉధృతి

- ధవళేశ్వరం వద్ద 14.40 అడుగులకు చేరిన నీటిమట్టం
- 13.92 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- భద్రాచలం వద్ద ప్రమాద హెచ్చరికలు ఉపసంహరణ



కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద

ధవళేశ్వరం, జూలై 29: గోదావరి ఉధృతి తగ్గుముఖం పట్టింది. 11 రోజులుగా తగ్గినట్టే తగ్గి మరలా పోటెత్తి ప్రవహిస్తున్న గోదావరి ఎగువ ప్రాంతాల్లో 48 గంటలుగా నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. దీంతో ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి 12 గంటల వ్యవధిలో అడుగుమేర తగ్గింది. ఇలాగే కొనసాగితే ధవళేశ్వరం వద్ద మంగళవారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించే స్థాయికి నీటిమట్టం తగ్గవచ్చు. ఆదివారం రాత్రి 11 గంటలకు 15.80 అడుగుల వరకు నీటిమట్టం పెరిగింది. ఈ సమయంలో అత్యధికంగా 16,09,099 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహించింది. 8 గంటల పాటు నిలకడగా కొనసాగి సోమవారం తెల్లవారుజామున తగ్గుముఖం పట్టింది. క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం రాత్రి 11 గంటలకు 14.40 అడుగులకు చేరింది.13,92,438 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద నీటిమట్టం తగ్గుతూ ఆదివారం రాత్రి 10 గంటలకు 47.70 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు.సోమవారం రాత్రి 11 గంటలకు నీటిమట్టం 42.80 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాదహెచ్చరికను ఉపసంహరించారు.

ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టాలు ఇవే

ఎగువున అన్ని ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గుముఖం పట్టింది. సోమవారం సాయంత్రానికి కాళేశ్వరం వద్ద నీటి మట్టం 10.04మీటర్లుగా నమోదుకాగా పేరూరు వద్ద 15.60మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 11.44మీటర్లు, భద్రాచలం వద్ద 43 అడుగులు, కూనవరం వద్ద 20.66మీటర్లు, కుంట వద్ద 12.18మీటర్లు, పోలవరం వద్ద 13.36మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.99మీటర్లుగా నీటి మట్టం నమోదయింది.

సమయం, డబ్బు వృథా చేసుకోవద్దు : డీఎస్పీ

బిక్కవోలు, జూలై 29: కోర్టుల చుట్టూ తిరిగి సమయం, డబ్బు వృథా చేసుకోవదని డీఎస్పీ కిషోర్‌కుమార్ సూచించారు. బలభద్రపురంలో ఈనెల 27 రాత్రి దళితవాడ కమ్యూనిటీ హాలు శుభ్రం చేయడం కోసం మీటింగ్ జరుగుతుండగా దళిత వాడలోని రెండు వర్గాలు ఘర్షణపడి కొట్టుకుని అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చేరారు. విషయం తెలియడంతో డీఎస్పీ సోమవారం బలభద్రపురం వచ్చి దళిత పెద్దలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కేసులు పెట్టుకోవడం వల్ల రోజుకూలీ పనిచేసుకునే వారి సమయం, డబ్బులు ఖర్చు అవుతాయని నచ్చజెప్పడంతో వారు సానుకూలంగా స్పందించారు. డీఎస్పీ వెంట సీఐ శివగణేష్, ఎస్ఐ బుజ్జిబాబు వున్నారు. కాగా ఆసుపత్రి సమాచారం మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వరల్డ్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు

కడియం, జూలై 29: ఫొటోగ్రాఫిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రా, రాజమహేంద్రవరం ఫొటో ఆర్ట్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కడియం పల్ల వెంకన్న నర్సరీలో సోమవారం వరల్డ్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వహించారు. పల్ల సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, గణపతి, వెంకటేష్, వినయ్ ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో పోర్ట్రియేట్ టెక్నిక్స్, కాంపోజిషన్, ఎక్స్‌పెరిమెంటల్ ఫొటోగ్రఫీ, మోడల్ షూట్ తదితర అంశాలపై వర్క్‌షాపు జరిగింది. ఫొటోగ్రఫీలో వస్తున్న ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఫొటోగ్రాఫిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర అధ్యక్షుడు మునిని వెంకటేశ్వరరావు, సెక్రటరీ జి.రామకృష్ణంరాజు, ఏపీ ఫొటోగ్రఫీ అకాడమీ కార్యదర్శి కె.సుధాకరరెడ్డి, ఫొటో ఆర్ట్స్‌క్లబ్ కార్యదర్శి టి.వీరభద్రరావు, కడియం యూనియన్ అధ్యక్షుడు బి.మల్లికార్జునరెడ్డి సహా రాష్ట్ర నలుమూలల నుంచి 59 మంది మెంబర్లు హాజరయ్యారు. ప్రతిఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.

పిల్లల అక్రమ రవాణా అడ్డగింత

ఆర్పీఎఫ్ పోలీసులకు డీఆర్ఎం ప్రశంసలు



అక్రమ రవాణా నుంచి ఆర్పీఎఫ్ సిబ్బంది రక్షించిన బాలలు

రాజమహేంద్రవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి): బాలల అక్రమ రవాణాను అడ్డుకొన్న రైల్వే భద్రతా దళం(ఆర్పీఎఫ్) పోలీసులను రైల్వే ఉన్నతాధికారులు సోమవారం ప్రశంసించారు. ఈ నెల 27న రాజమండ్రి-తుని స్టేషన్ల నడుమ ఆర్పీఎఫ్, ఏపీవో బచ్‌పన్ బచావో ఆందోళన్ ఆంధ్రప్రదేశ్ సిబ్బంది సంయుక్తంగా రైళ్లలో తనిఖీలు చేశారు. ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్‌లో 8 మంది బాలలను గుర్తించారు. వారు మరో నలుగురు గుర్తు తెలియని పెద్ద వారితో కలిసి వెళ్తున్నారు. ప్రయాణానికి కారణాలను బాలలు సరిగా వెల్లడించలేకపోవడంతో రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో దించి విచారించారు. విజయవాడ, చెన్నై, తిరుప్పూర్‌తోపాటు కేరళలోని వివిధ ప్రాంతాల్లో బాల కార్మికులుగా పని చేయించుకోడానికి తీసుకెళ్తున్నారని ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. బాలలను బాలల సంక్షేమ సమితికి అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది. సమయానికి స్పందించి బాలలను కాపాడడానికి చొరవ చూపిన సీనియర్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బి.తోకల, ఆర్పీఎఫ్ రాజమండ్రి పోస్ట్ కమాండర్ సైదయ్య తదితరులను డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ అభినందించారు.